VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 10.08.2026
సంపుటి : 09 సంచిక : 62 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



ఆషాఢ మాసం బోనాల సందర్భంగా గాంధీనగర్ లో 'నల్ల పోచమ్మ' అమ్మవారికి, కుటుంబ సమేతంగా బోనం సమర్పించిన ఇందిర శోభన్ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:

# కన్నుల పండుగగా లాల్ దర్వాజా బోనాలు

- దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- హైదరాబాద్ మహానగరంలో కన్నుల పండువగా బోనాలు
- పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు
- వచ్చిన భక్తులందరికీ అమ్మవారి దర్శనం కల్పించాలి
- భక్తులతో కిక్కిరిసిన లాల్ దర్వాజా ప్రాంతం
- అమ్మవారికి బోనం తో పాటు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

ఆషాఢ బోనాల జాతరలో భాగంగా పాత బస్తీ లోని లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళీ అమ్మవారిని పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లతో కలసి అమ్మవారిని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ దర్శించుకున్నారు.

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు అలాగే కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాలకు ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి సందర్భంగా పేర్కొన్నారు.

▶ మిగతా 2లో

# బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం: బండి సంజయ్





12

- బోనాల వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి
- భాగ్యలక్ష్మి ఆలయంపై కీలక హామీ
- పాతబస్తీలో బోనాలకు భారీ నిధులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ విమర్శలు
- ఆలయాలకు నిధుల కేటాయింపుపై ప్రశ్నలు
- కేసీఆర్‌పై తీవ్ర ఆరోపణలు

# నేడే నాగార్జున సాగర్‌లో వరుణ యాగం..



2

- సాగర్ విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో యాగం..
- మధ్యాహ్నం 3 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# కుమురం భీమ్ స్ఫూర్తితో గిరిజన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: సీతక్క



2

- అశ్వారావుపేటలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- కుమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి
- గిరిజన హక్కుల పరిరక్షణకు పిలుపు

# యువత క్విట్ ఇండియాను స్ఫూర్తిగా తీసుకోవాలి



2

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టమని వెల్లడి
- గాంధీ పిలుపుతో దేశం మొత్తం కదిలిందని వ్యాఖ్య
- వేలాది మంది త్యాగాలతో స్వేచ్ఛ సాధించామన్న పీసీసీ చీఫ్
- చరిత్రను యువత అధ్యయనం చేయాలని సూచన
- గాంధీ, నెహ్రూ వారసత్వాన్ని మరిపించే ప్రయత్నమని ఆరోపణ
- రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం అవసరమని పిలుపు
- బీజేపీపై, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ పాలనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని వెల్లడి
- ఓట్ల తొలగింపును అడ్డుకుంటున్నామని ప్రకటన
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా

# పోలీసుల ఫోకస్ డ్రగ్స్‌పైనే!

- డీజీపీ సీవీ ఆనంద్
- మావోయిస్టు ముప్పు పూర్తిగా తొలగి పోయింది
- రాష్ట్ర భద్రతకు ఎలాంటి ముప్పు లేదు
- కొత్త సవాళ్లపై పోలీసుల దృష్టి
- యువతను వేధిస్తున్న డ్రగ్స్ భూతం
- గ్రేహౌండ్స్ సేవలు ఇక కొత్త దిశలో
- రాజకీయ నేతల భద్రతపై డీజీపీ వివరణ



2

- త్వరలో కొత్త తెలంగాణ పోలీస్ మాన్యువల్

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 9:**

తెలంగాణలో మావోయిజం ప్రభావం పూర్తిగా అంతమైందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర భద్రతకు మావోయిస్టుల నుంచి ఎలాంటి ముప్పు లేదని పేర్కొన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్.. భావోద్వేగానికి గురైన మాజీ సీఎం

- నల్లబెల్లిలో కేసీఆర్ పర్యటన
- దశదినకర్మకు హాజరైన మాజీ సీఎం
- కుటుంబసభ్యులకు పరామర్శ
- సుదర్శన్‌తో అనుబంధం గుర్తుచేసుకున్న కేసీఆర్
- సాదాసీదా వ్యక్తిగా కొనియాడిన మాజీ సీఎం
- కేసీఆర్ రాకతో భారీగా కార్యకర్తలు



2

- నివాసం వద్ద స్వల్ప తోపులాట
- పోలీసుల పర్యవేక్షణలో కాన్వాయ్
- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

# అశ్వారావుపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క
- ఆదివాసుల చరిత్ర అంతా పోరాటాల చరిత్రే
- ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**అశ్వరావుపేట, ఆగస్టు ఆగస్టు 9:**

ఆదివాసుల చరిత్ర అంతా హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం సాగించిన పోరాటాల చరిత్రేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి సీతక్క పాల్గొన్నారు.



10

# హిందూ సమాజమంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు భయం: బండి సంజయ్

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- మైనారిటీ సంతుష్టీకరణే లక్ష్యమని ఆరోపణ
- బోనాలకు నిధులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేంద్ర మంత్రి
- రంజాన్, బోనాల నిధులపై నిలదీత
- నిరుద్యోగంపై కాంగ్రెస్ హామీలను ప్రస్తావన
- తెలంగాణ పోరాట చరిత్రపై ప్రశ్నలు
- సనాతన ధర్మం కోసం పనిచేస్తానని స్పష్టీకరణ
- టిప్పు సుల్తాన్ అంశంపై తీవ్ర వ్యాఖ్యలు
- యువతలో జాగ్రత్తిని కోరిన బండి సంజయ్



2

- పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనా విమర్శలు

# పోలీసుల ఫోకస్ డ్రగ్స్‌పైనే!

(మొదటి పేజీ తరువాయి)

గత మూడు దశాబ్దాలుగా మావోయిస్టుల కట్టడిపైనే ప్రధానంగా దృష్టి పెట్టిన పోలీసు వ్యవస్థ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన ప్రాధాన్యతలను మార్చుకుంటోందని తెలిపారు.ప్రస్తుతం తెలంగాణ పోలీసుల ముందున్న అతిపెద్ద సవాలు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణానేనని డీజీపీ వెల్లడించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పెరగకుండా కఠిన చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నామని వివరించారు.రాజకీయ నేతల భద్రతపై క్లారిటీప్రజాప్రతినిధులకు గన్‌మెన్ల సంఖ్యను తగ్గించడంపై వస్తున్న ఆరోపణలపైనా సీవీ ఆనంద్ స్పందించారు. మావోయిస్టుల ముప్పు తగ్గిన నేపథ్యంలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాల తరహాలోనే తెలంగాణలోనూ రాజకీయ నేతల భద్రతను సమీక్షించినట్లు తెలిపారు.భద్రతను పూర్తిగా తొలగించలేదని.. ఆయా వ్యక్తులకు ఉన్న ముప్పు స్థాయిని అంచనా వేసి అవసరమైన మేరకు మాత్రమే సిబ్బందిని తగ్గించినట్లు చెప్పారు. నిఘా విభాగాల నివేదికలు, సెక్యూరిటీ కమిటీ సిఫారసుల ఆధారంగానే భద్రతపై నిర్ణయాలు తీసుకుంటు న్నామని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని పేర్కొన్నారు.

### గ్రేహౌండ్స్ నుంచి కొత్త బాధ్యతలు

మావోయిస్టుల ఏరివేతలో కీలకంగా పనిచేసిన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి ప్రత్యేక విభాగాలను ఇకపై కొత్త సవాళ్లకు ఉపయోగించనున్నట్లు డీజీపీ తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణతో పాటు ఆహార కల్తీ ముఠాలపై చర్యల్లోనూ ఈ బలగాల నైపుణ్యాన్ని వినియోగించనున్నట్లు వెల్లడించారు.పోలీస్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమూలంగా మార్చే ప్రక్రియ కొనసాగుతోందని సీవీ ఆనంద్ చెప్పారు. త్వరలోనే కొత్త తెలంగాణ పోలీస్ మాన్యువల్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్..

- రూ.2.25 కోట్ల సాయం ప్రకటించిన బీఆర్ఎస్

**నల్లబెల్లి, వెలుతురు, ఆగస్టు 9:**

వరంగల్ జిల్లా నల్లబెల్లిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. ఆయన మృతిని తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఎంతో సాదాసీదాగా జీవించారని, ప్రజలతో కలిసి మెలిసి ఉండేవారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.కేసీఆర్ నల్లబెల్లి పర్యటనకు వస్తున్నారన్న సమాచారంతో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం పరిసరాలు పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోయాయి. కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కొద్దిసేపు స్వల్ప తోపులాట చోటుచే సుకుంది.పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. కేసీఆర్ కాన్వాయ్‌కు మార్గం సుగమం చేశారు. అనంతరం ఆయనను సుదర్శన్‌రెడ్డి నివాసం లోపలికి తీసుకెళ్లారు. అక్కడ కుటుంబసభ్యులతో మాట్లాడిన కేసీఆర్.. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున అందించాలని నిర్ణయించింది.అలాగే సుదర్శన్‌రెడ్డి తల్లి అమృతమ్మ భవిష్యత్ అవసరాలు, బాగోగుల కోసం రూ.25 లక్షలను బ్యాంకులో జమ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది. పిల్లల చదువు, భవిష్యత్తు సహా కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేసింది.సుదర్శన్‌రెడ్డి కుటుంబం ఒంటరిగా లేదని, పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి, సుదర్శన్‌రెడ్డి సేవలను స్మరించు కున్నారు. కేసీఆర్ పర్యటనతో నల్లబెల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల్లో భావోద్వేగ వాతావరణం నెలకొంది.

# యువత క్విట్ ఇండియాను స్ఫూర్తిగా తీసుకోవాలి

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 9:**

క్విట్ ఇండియా ఉద్యమం వెనుక ఉన్న చరిత్ర, త్యాగాలను నేటి యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక మలుపుగా నిలిచిందని పేర్కొన్నారు. నాంపల్లిలోని గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపిందని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలోకి వచ్చారని చెప్పారు. గాంధీతోపాటు జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి నాయకుల స్ఫూర్తి స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపిందని పేర్కొన్నారు.బ్రిటిష్ పాలకులు భారత్‌ను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంలో క్విట్ ఇండియా ఉద్యమం ముఖ్యమైన పాత్ర పోషించిందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ప్రజలు ఆస్తులు, జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. ఆ త్యాగాల ఫలితంగానే దేశానికి స్వేచ్ఛ లభించిందని తెలిపారు. ఈ చరిత్రను యువత విస్తృతంగా అధ్యయనం చేయాలని సూచించారు.ప్రస్తుతం దేశంలో గాంధీ, నెహ్రూ వంటి నాయకుల పాత్రను మరుగునపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కూడా బీజేపీ తన రాజకీయ ప్రయోజ నాలకు అనుగుణంగా సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం మార్చే ప్రయత్నాలు సరికాదని అన్నారు.రాజ్యాంగానికి విఘాతం కలిగించే చర్యలను ప్రజలు ప్రశ్నించాలని పీసీసీ చీఫ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఎవరూ శాశ్వతంగా ప్రజల కంటే పైస్థాయిలో ఉండరని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం అవసరమైతే అలాంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని అన్నారు. ప్రస్తుత జెన్ జీ కూడా తన హక్కుల కోసం ఉద్యమిస్తోందని పేర్కొంటూ.. నేటి యువత క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని అర్థం చేసుకోవాలని సూచించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో మేలు చేయలేకపోయిందని విమర్శించారు. ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయాలంటే నిర్మాణాత్మకంగా చేయాలని, అసత్య ఆరోపణలకు దూరంగా ఉండాలని సూచించారు.అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరోసారి ప్రజల మద్దతు తీసుకొస్తాయని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదని స్పష్టం చేశారు. కార్యకర్తల శ్రమకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతు న్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు పనిచేస్తున్నాయని చెప్పారు. ఓటు హక్కు పరిరక్షణను ప్రజాస్వామ్య పరి రక్షణలో కీలక అంశంగా అభివర్ణించారు.కుల, మత వివక్షలకు అతీతంగా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పీసీసీ అధ్యక్షుడు అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అందించిన విలువలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రను యువతకు చేరువ చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంపై మరింత అవగాహన కల్పించవచ్చని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

# కన్నుల పండుగగా లాల్ దర్వాజా బోనాలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా తెలంగాణ బోనాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ప్రభుత్వం రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేసి హైదరాబాద్ బోనాలను వైభవోపేతంగా నిర్వహించుకుంటు న్నామని, భక్తులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చే ప్రజలు అన్ని దేవాలయాల్లో దర్శించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం భవిష్యత్తులో కూడా జరిగే బోనాల జాతరాలను ఇంకా మెరుగైన రీతిలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అలాగే సింహవాణి మహంకాళి దేవాలయ అభివృద్ధికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలు అనుగుణంగా గత నెల నుండి హైదరాబాద్ లో జరుగుతున్న బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని, ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖ అధికారులు నిబద్ధతతో అలాగే బాధ్యతా యుతంగా విధులు నిర్వహిస్తున్నారని అధికారులని ఈ సందర్భంగా అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు తెలంగాణపై ఉండాలని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సుభిక్షంగా ముందుకు తీసుక వెళ్లాలని , రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని అలాగే రైతాంగం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నెలరోజు బోనాలలో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా అనేక కళా ప్రదర్శనలు చేపట్టామని అన్నారు. అలాగే చివరి భక్తునికి కూడా దేవాలయాల్లో దర్శనం కల్పించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు తప్పక ఉండాలని, ప్రభుత్వం మార్గదర్శకాలు అనుగుణంగా అన్ని దేవాలయాల్లో బోనాలను ఎంతో ప్రతిష్టంగా నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అలాగే అన్ని దేవాలయాల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టడం జరిగిందని అన్నారు. అలాగే రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతాంగం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం హైకోర్టు జడ్జి ఎస్ నంద సింహ వాహిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఈ సందర్భంగా స్వాగతం పలికారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అర్చకులు, దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి , శాసన సభ్యులు ఠాగూర్, మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్, మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు , జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సిపి సజ్జనార్, డిసిపి, స్పెషల్ ఆఫీసర్ రవి, ఆర్డీవో రామకృష్ణ, వివిధ విభాగాల అధికారులు, భక్తులు, ప్రముఖులు తదితరులు అమ్మవారిని దర్శించు కున్నారు.

# హిందూ సమాజమంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు భయం: బండి సంజయ్

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 9:**

హిందూ సమాజం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయంతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ ఆరోపించారు. మైనారిటీ సంతుష్టీ కరణ విధానాలకు ఆ రెండు పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. బీజేపీ మాత్రం అలాంటి రాజ కీయాలకు పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఆదివారం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

హైదరాబాద్‌లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులపైనా బండి సంజయ్ ప్రశ్నలు సంధించారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం మాత్రమే కాకుండా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో వేలాది ఆలయాలు ఉన్నాయని, బోనాల ఉత్సవాలకు కేటాయిస్తున్న నిధులు సరిపోతున్నాయా అని ప్రశ్నించారు. రంజాన్ పండుగకు కేటాయించే నిధులతో పోల్చి బోనాల కోసం ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని పరిశీలించాలని అన్నారు.హిం దువుల పండుగల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని బండి సంజయ్ ఆరోపించారు. తాను హిందువుల సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటానని చెప్పారు. గోమాతను వధించడం, ఆలయాలను ధ్వంసం చేయడం వంటి అంశాలపై ప్రశ్నించకూడదా అని నిలదీశారు. సనాతన ధర్మం కోసం తాను నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. హిందూ సమాజం ఐక్యంగా, జాగృతంగా ఉండాలని పిలుపునిచ్చారు.అయోధ్య రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు గతంలో వ్యతిరేకించారని బండి సంజయ్ విమర్శించారు. ఈ అంశంపై వాస్తవాలు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చలేదని కూడా ప్రశ్నించారు. చరిత్రను భావితరాలకు అందించే విషయంలో ప్రభుత్వాలు సమగ్రంగా వ్యవహరించాలని సూచించారు.టిప్పు సుల్తాన్ అంశాన్ని కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. టిప్పు సుల్తాన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయనను హీరోగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. దీపావళి సందర్భంగా మహిళలు, పిల్లలను హతమార్చిన వ్యక్తిగా టిప్పు సుల్తాన్‌ను ఆయన అభివర్ణించారు. అలాంటి వ్యక్తి విగ్రహాలను ఏర్పాటు చేయడం సమంజసమేనా అని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.బోనాల ఉత్సవాలకు తాను ప్రతి ఏడాది హాజరవుతున్నానని బండి సంజయ్ తెలిపారు. బోనాలకు, ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బీజేపీ స్వచ్ఛంద సంస్థ కాదని, అది ఒక రాజకీయ పార్టీ అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడటం తమ రాజకీయ బాధ్యతలో భాగమని పేర్కొన్నారు.తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని బండి సంజయ్ విమర్శించారు. హైడ్రాలో 150 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు సరూర్‌నగర్ స్టేడియం నిండిపోవడం రాష్ట్రంలో ఉద్యోగాల కోసం యువత ఎంతగా ఎదురుచూస్తుందో చెప్పడానికి నిద ర్శనమని అన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని ఇచ్చిన హామీని కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. ఆ హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సాధించిందని పేర్కొన్నారు.పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధి, విద్య, సంక్షేమ అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు.ప్రస్తుత యువతలో వస్తున్న చైతన్యాన్ని బండి సంజయ్ ప్రశంసించారు. జెన్ జీ యువత నుంచి స్ఫూర్తి పొందాలని హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతితో పాటు సనాతన ధర్మం, సామాజిక అంశాలపై యువత బహిరంగంగా మాట్లాడటం ఆసక్తికర పరిణామమని అన్నారు. హిందూ సమాజం తన హక్కులు, సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# కుమురం భీమ్ స్ఫూర్తితో గిరిజన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: సీతక్క

- పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్న సీతక్క
- రాజ్యాంగ హక్కులను వినియోగించుకో వాలని సూచన
- భాష, సంస్కృతి కాపాడుకోవడం బాధ్యత
- ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వం దృష్టి
- అధికారుల తీరుపై మంత్రి కీలక సూచనలు
- సీఎం రేవంత్‌కు గిరిజనులపై ప్రత్యేక అభిమానం
- హక్కుల సాధనకు ఐక్యతే బలమన్న మంత్రి



**అశ్వారావుపేట, వెలుతురు, ఆగస్టు 9:**

కుమురం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గిరిజనులంతా ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం అశ్వారావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినా రాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి స్థానిక కూడలిలో కుమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్క రించారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులు, గౌరవం, జాతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు పోరాడిన మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కుమురం భీమ్ పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు.తమ చరిత్ర మొత్తం పోరాటాలతో ముడిపడి ఉందని సీతక్క అన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించిన పూర్వీకులు అడవులు, కొండలు, వర్షాలు, వరదలు, జంతువులతో పోరాడుతూ తమ జీవనాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క, సారలమ్మ నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కుమురం భీమ్ వరకు ఎందరో తమకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు.రాజ్యాంగం గిరిజనులకు ప్రత్యేక హక్కులు, స్వయం ప్రతిపత్తి, భూ హక్కులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిందని మంత్రి వివరించారు. ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ కల్పించేలా రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ రూపుదిద్దుకుందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ప్రాంతాల గురించి కూడా ఆమె ప్రస్తావించారు.గిరిజనులు ఎవరిపైనా శత్రుత్వం పెంచుకోవాల్సిన అవసరం లేదని సీతక్క స్పష్టం చేశారు. ఏ కులాన్నీ, ఏ ప్రాంత ప్రజలనూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. అయితే రాజ్యాంగం కల్పించిన న్యాయమైన హక్కులను సాధించుకోవడానికి మాత్రం గిరిజనులు ఐక్యంగా తమ గొంతు వినిపించాలని సూచించారు.గిరిజనేతరుడైన అల్లూరి సీతారామరాజు కూడా గిరిజనుల హక్కుల కోసం పోరాడారని సీతక్క గుర్తుచేశారు. తమపై ప్రేమతో వచ్చిన వారిని గిరిజనులు ఎప్పుడూ అక్కున చేర్చుకున్నారని చెప్పారు. ప్రత్యేకంగా లభిస్తున్న అవకా శాలను సద్వినియోగం చేసుకోవడం ప్రతి గిరిజనుడి హక్కు అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అడవి బిడ్డలు, పేదలు, బడుగు బలహీన వర్గాలపై ప్రత్యేక అభిమానం ఉందని సీతక్క అన్నారు. దేశంలో మరెక్కడా జరగని విధంగా తెలంగాణలో కులగణన చేపట్టామని చెప్పారు. బీసీల సమస్యలతో పాటు దళితులు, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.భూముల సమస్యలు సహా గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని మంత్రి వెల్లడించారు.

పేదలు, నిరక్షరాస్యులు తమ సమస్యలను చెప్పుకునేందుకు అధికారుల వద్దకు వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రజల వినతులను గౌరవంగా స్వీకరించి, సాధ్యమైన మేరకు సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.కుమురం భీమ్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ గిరిజన హక్కుల సాధనకు ముందుకు సాగాలని సీతక్క పిలుపునిచ్చారు. గిరిజనుల భాష, వేషధారణ, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన వారసత్వం తమ సంస్కృతేనని మంత్రి పేర్కొన్నారు.

# నేడే నాగార్జునసాగర్‌లో వరుణ యాగం..

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

నేడే నాగార్జునసాగర్‌లో వరుణ యాగం..

సాగర్ విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో యాగం..

మధ్యాహ్నం 3 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం.

2.45 గంటలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌కు చేరుకోనున్న ముఖ్యమంత్రి.

అక్కడి నుంచి విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగే యాగం వద్దకు చేరుకోనున్న సీఎం.

యాగం ముగిసిన అనంతరం 4 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరనున్న ముఖ్యమంత్రి.



108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో విజయ్ విహార్‌లో వరుణ యాగం.


యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణయాగం.కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పం.

# అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

- గిరిజన ఆదివాసి బిడ్డలకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం
- గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్ల కేటాయింపు
- అడవిని కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధి చెందాలి
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 9:**



అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడు కుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్లు

2026–27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగు–భూమి అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. “ఒక గిరిజన గ్రామానికి రోడ్డు రావాలి.. ఒక ఇంటికి మంచినీరు అందాలి.. ఒక విద్యార్థికి మంచి విద్య లభించాలి.. ఒక యువకుడికి నైపుణ్యం రావాలి.. ఒక మహిళకు ఆదాయం సమకూరాలి.. ఒక రైతు భూమిలో పంట పండాలి. అప్పుడే బడ్జెట్‌కు నిజమైన అర్థం ఉంటుంది” అని మంత్రి పేర్కొన్నారు.

### ఏజెన్సీ ప్రాంతాల్లో దూరం అనే మాట ఉండకూడదు

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం ప్రతి గిరిజన కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అభివృద్ధి అంటే నగరాల్లో పెద్ద భవనాలు నిర్మించడం మాత్రమే కాదని.. మారుమూల గిరిజన తండాలో ఒక కుటుంబం జీవితం సులభతరం చేయడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు.

### భూమికి నీరు.. రైతుకు పంట.. కుటుంబానికి ఆదాయం

ఇందిరా గిరి జల వికాసం ద్వారా గిరిజన రైతుల భూములకు నీటి వసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌరశక్తి, సోలార్ పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అడవి.. ఆదివాసీకి తల్లి లాంటిది

ఆదివాసీకి అడవి కేవలం ప్రకృతి సంపద కాదని.. అది జీవనాధారం, సంస్కృతికి మూలం, భవిష్యత్తుకు భరోసా అని మంత్రి అన్నారు. అడవి అన్నం, ఔషధం, ఉపాధి, నీడ అందించిందని తెలిపారు. “ఆదివాసీ–అడవి బంధం చెట్టు–మనిషి సంబంధం కాదు.. తల్లి–బిడ్డ అనుబంధం” అని పేర్కొన్నారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

### అడవి నుంచి ఐఐటీ వరకు.. గిరిజన బిడ్డల విజయ ప్రస్థానం

గిరిజన గురుకులాల్లోని 166 విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి తెలిపారు. 2025–26లో పదో తరగతిలో 98 శాతానికి పైగా, ఇంటర్మీడియట్‌లో 86 శాతానికి పైగా, డిగ్రీలో 89 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.28 మంది ఐఐటీల్లో, 23 మంది ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందగా, 167 మంది నీట్‌లో అర్హత సాధించడం గిరిజన విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు.అవకాశాలు కల్పిస్తే గిరిజన బిడ్డలు ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లగలరని అన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో రాణించేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.

### పుస్తకంతో పాటు.. ఏఐ విద్య

ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఉద్యోగ అవకాశాలపై గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఏఐ ఆధారిత ఎస్టీఈఎం ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గిరిజన బిడ్డలు డాక్టర్, ఇంజినీర్, శాస్త్రవేత్త, అధికారి, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి గిరిజన యువత ఎదగాలని పిలుపునిచ్చారు.

### అటవీ ఉత్పత్తులకు విలువ జోడించాలి

తేనె, చింతపండు, ఔషధ మొక్కలు తదితర అటవీ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా గిరిజనులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ముడి ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించకుండా ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా గిరిజన యువత, మహిళా సంఘాలు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### గిరిజన మహిళ ఆర్థికంగా బలపడాలి

గిరిజన మహిళ కుటుంబం, వ్యవసాయం, అడవిపై ఆధారపడి నిరంతరం శ్రమిస్తోందని మంత్రి అన్నారు. ఆమె శ్రమకు తగిన విలువ, ఆదాయం లభించేలా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. “మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుంది.. కుటుంబం బలపడితే గిరిజన సమాజం బలపడుతుంది” అని పేర్కొన్నారు.

### పీఎం-జన్మన్ అమలులో తెలంగాణకు మూడో స్థానం

ప్రత్యేకంగా వెనుకబడిన గిరిజన కుటుంబాల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీఎం–జన్మన్ కార్యక్రమంలో తెలంగాణ దేశంలో మూడో ఉత్తమ రాష్ట్రంగా నిలవడం గర్వకారణమని మంత్రి తెలిపారు. ఇళ్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు ప్రతి అర్హమైన గిరిజన కుటుంబానికి అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ర్యాంకుల కంటే ఒక గిరిజన తల్లి “నా ఇంటికి నీళ్లు వచ్చాయి” అని చెప్పడం, ఒక రైతు “నా భూమికి నీరు వచ్చింది” అని చెప్పడం, ఒక విద్యార్థి “నాకు మంచి చదువు దొరికింది” అని చెప్పడమే ప్రభుత్వానికి అసలైన అవార్డు అని అన్నారు.

### మన భాష.. మన చరిత్ర.. మన సంస్కృతి

గిరిజన భాషలు కేవలం సంభాషణకు మాత్రమే పరిమితం కావని.. తరతరాలుగా వచ్చిన అటవీ జ్ఞానం, ఔషధ పరిజ్ఞానం, జీవన విధానం, చరిత్ర, సంస్కృతి వాటిలో నిక్షిప్తమై ఉన్నాయని మంత్రి అడ్లూరి తెలిపారు.గిరిజన భాషలు, జానపద కళలు, పాటలు, నృత్యాలు, సంప్రదాయ జ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు.“ఇంగ్లిష్ నేర్చుకోవాలి.. తెలుగు నేర్చుకోవాలి.. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి.. కానీ మన ఇంట్లో అమ్మమ్మ మాట్లాడే భాషను మాత్రం మర్చిపోవద్దు” అని గిరిజన విద్యార్థులకు సూచించారు.

### రాంజీ గోండ్ త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి

గిరిజన ఆదివాసీల వీరుల చరిత్రను పుస్తకాలకే పరిమితం చేయకుండా భావితరాలకు తెలియజేయాలని మంత్రి అన్నారు. రాంజీ గోండ్ వంటి వీరుల త్యాగాలను ప్రతి గిరిజన విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న రాంజీ గోండ్ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం భవిష్యత్ తరాలకు గిరిజన చరిత్ర, పోరాట స్ఫూర్తిని పరిచయం చేసే కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు.

### ఇందిరాగాంధీ గిరిజన సంక్షేమానికి బలమైన పునాది

మాజీ ప్రధాని దివంగత శ్రీమతి ఇందిరాగాంధీ గిరిజనుల హక్కులు, గౌరవం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. గిరిజనుల రాజ్యాంగపరమైన రక్షణలు, రిజర్వేషన్లు, ప్రత్యేక అభివృద్ధి విధానాలకు బలమైన పునాది ఏర్పడిందన్నారు.అటవీ హక్కుల చట్టం గిరిజనుల భూమి, అటవీ హక్కులకు చారిత్రక గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాగితాలకే పరిమితం చేయకుండా కార్యరూపంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందన్నారు.

### ప్రభుత్వంతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి

గిరిజన సమాజ అభివృద్ధిలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, మద్యపానం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.యువత నైపుణ్యాలు నేర్చుకోవాలని, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని, కాపాడాలని, చెట్లను పెంచాలని సూచించారు.

### కొత్త ఆదివాసీ తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

ప్రతి గిరిజన గ్రామంలో రహదారి, విద్యుత్, మంచినీరు, మంచి పాఠశాల, ఆరోగ్య సదుపాయం, ఇంటర్నెట్, యువతకు నైపుణ్య కేంద్రం, మహిళలకు ఉపాధి, రైతులకు సాగునీరు అందుబాటులో ఉండాలని మంత్రి అన్నారు.అదే సమయంలో మన పాట, మన నృత్యం, మన భాష, మన పండుగ, మన అడవి, మన గౌరవం కూడా నిలిచి ఉండాలని ఆకాంక్షించారు.“మన అడవిని కాపాడుదాం.. మన భూమిని కాపాడుదాం.. మన భాషను, మన సంస్కృతిని, మన హక్కులను కాపాడుదాం. అన్నింటికంటే ముఖ్యంగా మన పిల్లల భవిష్యత్తును కాపాడుదాం” అని పిలుపునిచ్చారు. “అడవిని కాపాడుదాం–ఆదివాసీని బలపరుదాం.. ఆదివాసీని బలపరుదాం–తెలంగాణను బలపరుదాం” అని మంత్రి అన్నారు.

### అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు

గిరిజన హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ మాట్లాడుతూ గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, ఆరోగ్యం, మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి, సంస్కృతి–సంప్రదాయాల పరిరక్షణకు శాఖ ప్రాధాన్యం ఇస్తోందన్నారు.గిరిజనుల సాంప్రదాయ జ్ఞానం, జీవన విధానం, కళలు, భాషలు, ఆచారాలను భావితరాలకు అందించేందుకు టీఆర్ఐ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### గిరిజనులకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి

మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాలో గిరిజన జనాభా ప్రాతిపదికన కనీసం ఒక శాసనసభ స్థానం కల్పించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ హయాంలో లంబాడీలకు కల్పించిన రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించారని తెలిపారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు గిరిజనేతరుల అక్రమ ప్రవేశం, భూముల ఆక్రమణ వంటి అంశాలపై కఠిన నియంత్రణ అవసరమన్నారు.మాజీ ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాజం తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయాలు, ఆచారాలు, కళలు, భాషలు, జీవన విధానాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఎమ్మెల్సీ శ్రీ శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాజంలో విద్య ద్వారానే శాశ్వ తమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గిరిజన కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.TGTWREIS సెక్రటరీ శ్రీమతి సీతాలక్ష్మి మాట్లాడుతూ.. ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాల ను గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఇతర విద్యాసంస్థల్లో కూడా నిర్వహించి విద్యార్థులకు గిరిజన చరిత్ర, సంస్కృతి, వారసత్వంపై అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజన విద్యార్థులు ఆధునిక సాంకేతిక రంగాల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

### ఎంపీ శ్రీ బలరాం నాయక్ మాట్లాడుతూ..

ఆదివాసీ దినోత్సవాన్ని కొత్త సంకల్పానికి ప్రారంభ దినంగా భావించాలని అన్నారు. వచ్చే ఏడాది సాధించాల్సిన లక్ష్యాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని పిలుపునిచ్చారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన గిరిజన కుటుంబాలకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

### తొమ్మిది మంది ప్రముఖులకు సన్మానం

ఆదివాసీ సమాజం, గిరిజన సంక్షేమం, విద్య, సంస్కృతి, హక్కుల పరిరక్షణ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సన్మానితుల్లో మెస్రం మనోహర్, మర్సుకోల కళావతి, కాట్రాజు సైదమ్మ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజనలు వివిధ కళా సంస్కృతులు సంబంధించిన ప్రదర్శనలు ఆటపాటలు , నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి .ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర రెడ్డి, ట్రైబల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ డా. డి. సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ ఎం. బాలు, ట్రైకార్ జి.ఎం. శంకర్ రావు, GM GCC ప్రతాప్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు, ఉద్యోగులు, వివిధ గిరిజన సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హరిభోళి నల్లపోచమ్మ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

- భక్తిశ్రద్ధలతో హరిభోళి నల్లపోచమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్

**హరిభోళి వెలుతురు ఆగస్టు 09::**



హరిభోళి నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మరియు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లపోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ప్రార్థించారు.

“నల్లపోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. ప్రజలందరికీ మంచి జరగాలి. రైతులు, యువత, మహిళలు, పేదలు సంతోషంగా ఉండేలా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలి” అని వారు ఆకాంక్షించారు.ఆలయానికి వచ్చిన భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆషాఢ బోనాల వేడుకలు

**పాల్గొన్న డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

ఆదివారం రోజున యూసుఫ్‌గూడలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారి ఆధ్వర్యంలో, వారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఆషాఢ బోనాల వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా అనిపించింది.ప్రజల ఆశీర్వాదంతో ఇటీవలే ఎమ్మెల్యేగా ఎన్నికైన యువ, డైనమిక్ నాయకుడు నవీన్ యాదవ్, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ద్వారా ప్రజలకు సేవ చేయడంతో పాటు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని కాపాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకల్లో అందరినీ భాగస్వాములను చేయడం ఎంతో అభినందనీయం.ఈ బోనాల వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సెలబ్రిటీలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు.ఈ పవిత్రమైన బోనాల సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తూ, తెలంగాణ ప్రజలందరిపై అమ్మవారి చల్లని చూపు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నాను. ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని, మన తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా, అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలి, మన తెలంగాణ ఎల్లప్పుడూ శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలి అని డా. రేఖ బోయలపల్లి



వైస్ ప్రెసిడెంట్
తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అన్నారు.

# బలహీనవర్గాల బలం పుంజాల శివశంకర్



దేశం స్వాతంత్ర్యం కోసం ఊపిరాడకుండా పోరాడుతున్న రోజులవి. 1929 ఆగస్టు 10న పుట్టిన ఒక బాలుడు, రాబోయే 70 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ, రాజకీయం, పరిపాలన అనే మూడు స్తంభాలకు తన చేతులతో పునాదులు వేస్తాడని ఎవరు ఊహించారు?

పుంజాల శివ శంకర్ న్యాయవాదిగా మొదలై, న్యాయమూర్తిగా ఎదిగి, మంత్రిగా దేశాన్ని నడిపి, గవర్నర్ గా రెండు రాష్ట్రాలకు తండ్రిలా నిలిచిన అరుదైన వ్యక్తిత్వం. ఏ పదవి ఇచ్చినా దానికి గౌరవం తెచ్చిన గొప్ప నాయకుడు. ఆయన జీవితం ఒక తెరిచిన పాఠ్యపుస్తకం. ఎందుకంటే అధికారం కోసం కాకుండా ప్రజాసేవ కోసం బతికిన చరిత్ర ఆయనది. అమృత్ సర్ హిందూ కళాశాలలో బీఏ, హైదరాబాద్ ఉస్మానియా లా కాలేజీలో ఎల్ఎల్బీ చదివారు. చదువు పూర్తయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా అడుగుపెట్టారు. 1974–1975లో నేరుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ రెండు ఏండ్లు ఆయనకు చట్టం అంటే ఏంటో, ప్రజల బాధ అంటే ఏంటో నేర్పాయి. ఎమర్జెన్సీ సమయంలో దేశమంతా గందరగోళంలో ఉన్నప్పుడు, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తరపున కోర్టుల్లో వాదించి, ఆమెపై వచ్చిన ఆరోపణలను కొట్టివేయించడంలో శివ శంకర్ పోషించిన పాత్ర చాలా కీలకం. అక్కడే ఇందిరా గాంధీకి ఆయనపై నమ్మకం కుదిరింది.

1979లో సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు తొలిసారి ఎన్నికయ్యారు. ఇక అక్కడి నుండి వెనక్కి తిరిగి చూడలేదు. శివ శంకర్ ని కేవలం ఒక మంత్రిగానే చూడలేం. ఆయన చేపట్టిన ప్రతి శాఖలో ఒక సంస్కరణ జరిగింది. న్యాయశాఖలో చారిత్రాత్మక నిర్ణయం 1981 మార్చి 18. శివశంకర్ జీవితంలోనే కాదు, భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే కీలక మలుపు. అదనపు న్యాయమూర్తులను ఒక హైకోర్టు నుండి మరో హైకోర్టుకు బదిలీ చేసే అధికారం కేంద్రానికి ఇస్తూ అన్ని రాష్ట్రాల గవర్నర్లు, సీఎంలకు సర్క్యులర్ పంపారు. "కులం, బంధుత్వం, ప్రాంతీయత వంటి సంకుచిత ధోరణులను దాటి జాతీయ సమైక్యతను పెంచడానికి" అని ఆ సర్క్యులర్ స్పష్టంగా పేర్కొంది. ఈ ఒక్క నిర్ణయం నేటికీ కొలీజియం వ్యవస్థకు, న్యాయమూర్తుల బదిలీలకు ఆధారం. న్యాయం అంటే కోర్టు గదిలోనే కాదు, వ్యవస్థలో కూడా ఉండాలని నిరూపించారు.

దేశ ఆర్థిక వెన్నెముక అయిన చమురు రంగాన్ని శివ శంకర్ పెట్రోలియం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో క్రమబద్ధీకరించారు.విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా ప్రపంచ వేదికపై భారత్ గొంతును బలంగా వినిపించారు. ఇందిరా, రాజీవ్ గాంధీ మంత్రివర్గాల్లో అత్యంత విశ్వసనీయ మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారు.1978, 1980, 1985లో లోక్ సభ సభ్యుడిగా గెలిచారు. 1985లో గుజరాత్ నుండి రాజ్యసభకు వెళ్లి 1993 వరకు కొనసాగారు. 1989–1990 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా గళమయ్యారు. 69 ఏళ్ల వయసులో రాజకీయం నుండి తప్పుకుంటారనుకున్న సమయంలో తెనాలి నుండి పోటీ చేసి టీడీపీ సిట్టింగ్ ఎంపీ శారదా తాడిపర్తిని ఓడించారు. ప్రజల కోసం ఆయన ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించారు.

## బీసీల గొంతుక - చివరి శ్వాస వరకు పోరాటం

శివ్ శంకర్ గారి జీవితంలో అత్యంత గర్వించదగ్గ అధ్యాయం ఇదే. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోతుంది. బీసీల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి, వారి హక్కుల కోసం ఆయన నిరంతరం ప్రభుత్వాలతో మాట్లాడారు, పోరాడారు. బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో గళం వినిపించారు. పదవుల్లో ఉన్నప్పుడు మాత్రమే కాదు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా బీసీల సమస్యలను పార్లమెంట్ లో లేవనెత్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే బీసీల గొంతుకై నిలిచిన నాయకుడు శివ్ శంకర్. పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా పోరాడారు. పి. శివ్ శంకర్ జీవితంలోని అత్యంత ప్రకాశవంతమైన అధ్యాయం బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఆయన చేసిన అలుపెరగని పోరాటం.

జూనియర్ లాయర్ గా ఉన్నప్పటి నుండే స్వతంత్ర భారతంలో బీసీలు నిరంతరం మోసపోతున్నారని గ్రహించారు. వారి స్థితిగతులు మెరుగుపర్చడానికి అప్పుడే కంకణం కట్టుకున్నారు. మాడపాటి హనుమంతరావు హైదరాబాద్ మేయర్ గా ఉన్న సమయంలో ఆయనకు పర్సనల్ అసిస్టెంట్ గా పనిచేస్తూనే, అనాటి సీఎం బూర్గుల రామకృష్ణారావును కలిసి రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల జాబితా తయారు చేయాలని పట్టుపట్టారు. ఆయన చొరవ ఫలితంగానే కాకా కలేల్కర్ కమిషన్ సూత్రాల ఆధారంగా బూర్గుల ప్రభుత్వం మొట్టమొదటి బీసీ జాబితాను వెలువరించింది. ఆ రోజుల్లో బీసీల కోసం పోరాడిన వాళ్ళల్లో శివ్ శంకర్ కూడా ముందు వరుసలో నిలిచారు. బీసీల కోసం నాయకత్వం వహించారు. బలహీన వర్గాల కోసం అనేక సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య ప్రభుత్వాల కాలంలోనూ బీసీల హక్కుల కోసం నిరంతరం శ్రమించారు. "జాబితా తయారీకి ముందు ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనంపై శాస్త్రీయ అధ్యయనం జరగాలి. అలాంటి జాబితానే కోర్టుల్లో నిలబడుతుంది" అని అధికారులకు స్పష్టం చేశారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే తూర్పు కాపులను బీసీ కేటగిరిలో చేర్చారు. నేడు వారు అన్ని రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. చివరి శ్వాస వరకు బీసీల గొంతుకై నిలబడిన శివ్ శంకర్, ఇందిరా గాంధీకి న్యాయం కోసం కోర్టులో పోరాడి, ఆ తర్వాత ఆమె మంత్రివర్గంలోనే న్యాయశాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. అది ఆయన నిబద్ధతకు, నమ్మకానికి నిదర్శనం.

## గవర్నర్ గా రెండు రాష్ట్రాలకు రాజధర్మం

1994 నుంచి 1995 వరకు సిక్కిం గవర్నర్ గా, 1995 నుంచి 1996 వరకు కేరళ గవర్నర్ గా సమర్థవంతంగా, చాలా క్రియాశీలకంగా పనిచేశారు.గవర్నర్ అంటే రాజ్ భవన్ లో కూర్చునే పదవి కాదని, ప్రజల మధ్యకు వెళ్లే బాధ్యత అని నిరూపించారు. పర్వత రాష్ట్రం సిక్కిం నుండి తీర ప్రాంత కేరళ వరకు, రెండు పూర్తి భిన్న సంస్కృతులకు గవర్నర్ హోదాలో ఒకేలా న్యాయం చేశారు. శివ శంకర్ ఈరోజు మన మధ్య లేకపోవచ్చు. కానీ.. ఆయన రాసిన ప్రతి సర్క్యులర్, ఆయన వాదించిన ప్రతి కేసు, ఆయన సంతకం చేసిన ప్రతి ఫైల్ ఇప్పటికీ దేశాన్ని నడుపుతున్నాయి. ఆయన రాసిన పుస్తకం అదొక్కటే ముగింపు చదివితే మనకి ఎన్నో విషయాలు బోధపడతాయి. ఆయనని అనుచరించడం అంటే ఆయన ఫోటోలు పెట్టడం కాదు, విగ్రహాలు కట్టడం కాదు.. శివశంకర్ చూపిన దారిలో నడవడం, ఆయన ఆచరించిన సిద్ధాంతాల కోసం పనిచేయడం నేటి తరం, రాజకీయ నేతలు శివశంకర్ కు అర్పించే నిజమైన నివాళి.1929లో పుట్టి, ఒక శతాబ్దపు భారత్ ను చూసిన శివ శంకర్ జీవితం మనకు చెప్పేది ఒకటే – అధికారం శాశ్వతం కాదు, కానీ నిజాయితీ శాశ్వతం అని నిరూపించారు. గొంతుకకు, న్యాయానికి నిలబడిన ఆ మహానుభావుడికి జయంతి సందర్భంగా నివాళి.

సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్ట్.



సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్ట్

# జెండా పండుగలో ప్రజలందరి భాగస్వామ్యం ముఖ్యం




పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి
రాష్ట్ర అధికార ప్రతినిధి,ఆంధ్రప్రదేశ్

దేశ ఐక్యతకి సమగ్రతకి ఆత్మగౌరవానికి ఆకాంక్షలకి ప్రతిరూపం మన జాతీయ జెండా. బ్రిటిష్ వాడి దాస్య శృంకలాలని చేదించి భారతీయులందరికీ స్వేచ్ఛ స్వాతంత్రం అందిన రోజు ఆగస్టు 15, 1947. ఈ 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10వ తారీఖు నుండి జెండా పండుగ ప్రారంభమవుతోంది. ప్రతి భారతీయుడు ఏ మూల ఉన్నా ఏ దేశంలో ఉన్నా ఈ జెండా పండుగలో భాగస్వామ్యం అయ్యే విధంగా తమ ఇంటి పైన ఎంతో భక్తిశ్రద్ధలతో మన జాతీయ జెండాని ఆవిష్కరించి దేశ స్వాతంత్రం కోసం బలిదానం చేసిన మహనీయులని స్మరించుకుంటూ జాతీయగేయమైన వందేమాతరాన్ని ఆలపించే "హర్ ఘర్ తిరంగా" అంటే "ప్రతి ఇంట త్రివర్ణ పతాకం" కార్యక్రమం ప్రారంభం అవుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తిరంగా యాత్రలు, తిరంగా ర్యాలీలు, తిరంగా సంగీత కార్యక్రమాలు, వందేమాతరం సామూహిక గానం వంటి వివిధ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని అలాగే జాతీయ జెండాతో సెల్ఫీ దిగి harghartiranga.com వెబ్ సైట్ లో అప్లోడ్ చేసినట్లయితే మీకు ఒక సర్టిఫికెట్ ఇవ్వటం జరుగుతుంది. గత సంవత్సరం నిర్వహించిన ఈ జెండా పండుగలో సుమారు 7.50 కోట్ల మంది తమ సెల్ఫీ ఫోటోని అప్లోడ్ చేశారు. ఈ సంవత్సరం అంతకన్నా ఎక్కువమంది పాల్గొని దేశ ఐక్యత ని సమగ్రతని సోదర భావాన్ని పెంచాలని దేశం కోసం అంతులేని త్యాగాలు చేసిన మహానుభావులందరినీ స్మరించుకోవాలని ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాము.

# గౌలిగూడ శ్రీ మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పించిన హార్కర



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

గౌలిగూడలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ సలహాదారు.

(ప్రజా సంబంధాలు & ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్ రావు గారు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని హర్కర వేణుగోపాల్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అక్కన్న మాదన్న ఆలయంలో హార్కర వేణుగోపాల్‌రావు ప్రత్యేక పూజలు

- ఆషాఢ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
- ఓల్డ్ సిటీలో ఘనంగా బోనాల వేడుకలు
- అమ్మవారిని దర్శించుకున్న హార్కర వేణుగోపాల్‌రావు



- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు
- రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష
- ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని అభిలాష

ఆషాఢ బోనాల పర్వదినం సందర్భంగా హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని అక్కన్న మాదన్న ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న హార్కర వేణుగోపాల్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆషాఢ బోనాల సందర్భంగా ఓల్డ్ సిటీలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న హార్కర వేణుగోపాల్‌రావు

- ఆషాఢ బోనాల వేడుకల్లో పాల్గొన్న సలహాదారు



- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వేణుగోపాల్‌రావు
- లాల్‌దర్వాజాలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు
- తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు
- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష
- రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని అభిలాష

ఆషాఢ బోనాల పర్వదినం సందర్భంగా హైదరాబాద్ లాల్‌దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, శాంతియుతంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.ఆషాఢ బోనాల సందర్భంగా లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## చిత్తారమ్మ అమ్మవారికి బోనం సమర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు..

- **ప్రజల ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాల కోసం ప్రత్యేక పూజలు..**

**కూకట్ పల్లి, ఆగస్టు 9 వెలుతురు:**





ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు దంపతులు ఆదివారం వేకువ జామునే కూకట్‌పల్లిలోని ప్రసిద్ధ చిత్తారమ్మ దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ చిత్తారమ్మ అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగను పురస్కరించుకుని చిత్తారమ్మ దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ హయాంలో బోనాల పండుగకు మరింత ప్రాధాన్యత కల్పించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన బోనాల పండుగ నేడు తెలుగు ప్రజల పండుగగా విశేష ఖ్యాతిని పొందుతోందని అన్నారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్తారమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి దంపతులు..

**కూకట్ పల్లి ఆగస్టు 09 వెలుతురు:**

బోనాల పండుగ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్, కూకట్‌పల్లి పార్టీ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి–రంగారావు దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, హనుమాన్‌నగర్, రామకృష్ణనగర్, రిక్షా పుల్లర్స్ కాలనీ, పీజేఆర్ ఫంక్షన్ హాల్, వెంకటేశ్వరనగర్, ఆల్విన్ కాలనీ ఫేజ్–1, కమల ప్రసన్ననగర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను వారు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాధవరం రోజాదేవి రంగారావు దంపతులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో శాంతి, సౌభ్రాతృత్వం, ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో



సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, వివిధ అమ్మవారి ఆలయాల కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం బోనాలు

- **భక్తి, ఐకమత్యం, సామాజిక సామరస్యానికి ప్రతీక: డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి ఆగస్టు 09 వెలుతురు:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతిబింబమని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. బోనాలు కేవలం అమ్మవారికి సమర్పించే నైవేద్యం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, భక్తి విశ్వాసాలు, తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నిర్వహించిన బోనాల జాతర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వివిధ ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని నేటితరం యువత తెలుసుకుని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. బోనాల పండుగ ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐకమత్యం, సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బోనాల పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, దెండి అరవింద్ రెడ్డి, పులి శివకుమార్



గౌడ్, రాజేష్ గౌడ్, కరుణాకర్ నాయుడు, తూము వినయ్, గాజుల మహేష్ గౌడ్, రాజు ముదిరాజ్, కుక్కల రమేష్, పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, విఠల్ రెడ్డి, ఆది రెడ్డి, మధుమోహన్, రాజమల్లయ్య, రవీందర్ ముదిరాజ్, శేఖర్ గజానంద్, మధు గౌడ్, మొయినుద్దీన్, నరసింహ యాదవ్, అరుణ్ గౌడ్, మల్లేష్ యాదవ్, కలికోట బాలరాజు, శ్రవణ్, లక్ష్మి నారాయణ, నరేష్ తదితర గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో కూకట్‌పల్లి అభివృద్ధి.. బోనాల వేడుకల్లో బండి రమేష్

**కూకట్ పల్లి, ఆగస్టు 9 వెలుతురు:**

ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట, బేగంపేట, బోయిన్‌పల్లి, అస్మత్‌పేట్, బాలానగర్, ఫతేనగర్, దిల్‌దయాల్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పలు అమ్మవారి ఆలయాలను ఆయన సందర్శించారు. ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుచుకోవడం తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్లో అంతర్భాగమని పేర్కొన్నారు. బోనాల పండుగ ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సామాజిక సామరస్యాన్ని మరింత పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.



## అమ్మవారి ఆశీస్సులతో కూకట్ పల్లిలో శాంతి అభివృద్ధి వెల్లివిరియాలి.. యుగంధర్ రెడ్డి

**కూకట్ పల్లి ఆగస్టు 09 వెలుతురు:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫిరోజ్‌గూడ, బాలానగర్, రాజు కాలనీ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌గూడ, బాలానగర్, రాజు కాలనీల్లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ, శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆలయాలను సందర్శించిన యుగంధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ప్రార్థించారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధి, సౌభ్రాతృత్వం మరింతగా వెల్లివిరియాలని అమ్మవారిని కోరుకున్నట్లు యుగంధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో




వైడబ్ల్యూఏ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముక్తార్ అహ్మద్‌తో పాటు స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: ముమ్మారెడ్డి ప్రేమకుమార్..

**కూకట్ పల్లి, ఆగస్టు 9 వెలుతురు:**

ఆషాఢ బోనాల పండుగ మహోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు దేవస్థానానికి చేరుకున్న ప్రేమకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే



బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ నియోజకవర్గ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాకుమాను లక్ష్మణ్‌రావు, కొల్లా శంకర్, సిరిగినేని హరీష్, విష్ణు సాయి రణదీప్, ఆర్. రాధిక తదితరులు పాల్గొన్నారు.


## ఇబ్రహీంపట్నంలో ఎంఆర్‌ఆర్ ఫౌండేషన్, మల్ రెడ్డి యువశక్తి నేతృత్వంలో ఉచిత శిక్షణ

- **పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
- **అభ్యర్థుల నుంచి తొలిరోజు విశేష స్పందన**
- **గెలుపే లక్ష్యంగా ముందడుగు వేయాలని అభిషేక్ రెడ్డి పిలుపు**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 09:**

ఇబ్రహీంపట్నం ఎంఆర్ ఆర్ ఫౌండేషన్ మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇబ్రహీం పట్నంఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టడమే కాకుండా ఇక్కడి యువతను ఉన్నతస్థాయికి చేర్చటం కూడా తన సంకల్పమని అన్నారు జీవితంలో ఎదుగుదలకు వేసేప్రతీ అడుగులో తమ సహకారం ఉంటుందని యువత కు ఆయన హామీ ఇచ్చారు మల్ రెడ్డి యవశక్తి. ఎంఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి సారథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పోలీస్ ఉద్యోగాల అభ్య ర్థులకు ఉచిత శిక్షణ దృష్ట్యా ఆదివారం దరఖాస్తుల స్వీకరణ ఘనంగా ప్రారంభమైంది భవిష్య త్ మొత్తం యువత చేతుల్లోనే ఉందని వారు సరైన మార్గంలో వెళ్తేనే దేశం అన్ని విధాలుగా అ భివృద్ధి సాధిస్తుందని మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు ఇందులో భాగంగానే ఇక్కడి యువతకు వి ద్య ఉద్యోగ ఉపాధి కల్పనపై దృష్టి సారించినట్లు తెలిపారు అభిషేక్ నేతృత్వంలో చేపట్టిన ఈశిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులంతా వినియోగించుకోవాలని సూచించారు మన జి ల్లాకు పోస్టులు లేవని ఆందోళన చెందుతున్నారని కొన్ని కారణాలతోనే ఇక్కడ ప్రక్రియ ఆగినట్లు సమాచారం ఉందన్నారు ఈవిషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా నో టిఫికేషన్ వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అప్పటి వరకు సమయం వృథాచేసు కో కుండా చదువులపై దృష్టి సారించాలని సూచించారు రేపటి జీవితానికి బలమైన పునాదివేసేలా మా ప్రయత్నం అభిషేక్ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత చేస్తున్న ప్ర యత్నాలకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని మల్ రెడ్డి యువశక్తి సారథి మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు సివిల్స్ స్థాయిలో రాష్ట్ర పోలీస్






ఉద్యోగాలకు పోటీ సిలబస్ ఉన్న తరుణం లో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ప్రిపరేషన్ పైనే దృష్టి సారించాలని చెప్పారు ఇందుకునిపుణు ల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తాము చేయనున్నట్లు చెప్పారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంప ట్నంఏసీపీ రాజు సీఐ మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు ఈసీ శేఖర్ గౌడ్ (మామ) మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి నాయకులు మహిపాల్ పాండు రంగారెడ్డి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ భాస్కరాచారి ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు ఫిజిక్స్ ఫ్యా కల్టీ రమేశ్తో పాటు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి చిత్తారమ్మ జాతరలో కుటుంబ సమేతంగా బోనం, పూల తొట్టెలు సమర్పించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

**భక్తులకు నిరంతరంగా పులిహోర ప్రసాదం పంపిణీ**

**కూకట్ పల్లి, ఆగస్టు 9 వెలుతురు:**

ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా కూకట్‌పల్లిలోని శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూల తొట్టెలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు అమ్మవారిని ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. జాతర రోజంతా నిరంతరంగా భక్తులకు ప్రసాదాన్ని అందిస్తూ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం



ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వేద ఆశీర్వచనాలతో వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, నిర్వాహకులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల రాకతో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## ఎలిమినేడు గ్రామంలో మహంకాళమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే

- **మహంకాళమ్మకు ప్రత్యేక పూజలు సుఖసంతోషాలతో దీవించాలని మొక్కుకున్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 09:**

ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా తమ స్వగ్రామ మైనఎలిమినేడు గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యేబీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు.మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రజలందరూ సుఖసం తోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారుఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డుసభ్యులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.యువత మహిళలు పాల్గొన్నారు



## ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

**రామన్నపేట ఆగస్టు 09 (వెలుతురు):**

కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం. వి .రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు.పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని. వారు అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టు ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమాని కి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు



డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాత్ర బృందం రాగిరి కృష్ణయ్య ,వి. వెంకట నరసయ్య, గౌని ఎంకన్న, చౌగానీసీతా రాములు, గౌని సాంబయ్య, పామనుగుళ్ళ అచ్చాలు, మొక్క నాగేశ్వరరావు, బుర్ర సుధాకర్, తాళ్లపల్లి నర్సయ్య, పాలకూరి జగన్, సురుగు రాజేష్ గౌడ్, హనుమాండ్ల కాడి నవీన్, జిల్లా అధ్యక్షులు రాగిరి కృష్ణయ్య, బోలగోని జయరాములు, గాజుల ఆంజనేయులు, బామండ్ల పెల్లి బాలరాజు ,ఎర్ర రవీందర్ ,కునూరు మల్లేష్, మునుకుంట్ల లెనిన్, బైరు రమేష్, తూర్పునూరు శ్రీను, పబు గంగాధర్ల్, వెంకన్న పల్లె సత్యం, ఆకిటి శీను, పబ్బు శేఖర్, కనకయ్య, గంగాధర్, అంజయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధర్నా

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 09:**

మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధర్నా నిర్వహించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ రైతులకు ఇవ్వాల్సిన త్రీఫేస్ కరెంటు 24 గంటలు కాకుండా 10 గంటలు ఇస్తూ రైతులను చాలా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుంది. అదేవిధంగా లో వోల్టేజి సమస్యలతో స్టార్టర్లు మోటర్లు కాలిపోవడం జరుగుతుంది. దీనితో రైతులు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకొని నాణ్యమైన విద్యుత్తును అందించి రైతులకు సరిపడా త్రీఫేస్ కరెంటు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీలు సర్పంచులు రేఖ యాదయ్య, పున్న వెంకటేశం, ఎండి అమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్ పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, కోనూరు ముత్తయ్య, కోళ్ల కిషన్, ఆవుల నరేందర్, చిన్నపాక శ్రీనివాస్, బొడ్డు అల్లయ్య, చొప్పరి నరసింహ, తాళ్ల క్రాంతి కుమార్, బండ శ్రీనివాస్ రెడ్డి, మామిళ్ల అశోక్, గంగుల రాఘవరెడ్డి, నక్క నరేందర్, బుర్ర శ్రీశైలం,



ఎండి అజాజ్ ఖాన్, బొడ్డుపల్లి రాజు, గర్దాస్ కరుణాకర్, వంగాల యాదయ్య, జెల్ల శ్రీను, కందగట్ల శ్రీను, మామిళ్ళ కుమార్, మామిడి పద్మా రెడ్డి, మేడి కృష్ణ, కోనూరు ఆంజనేయులు, అంతటి మల్లేశం, నీరుడు కల్లూరి నరేష్, సురేష్ గోవు, రమేష్ గణేష్, కొమ్మ గోని రమేష్, గర్దా శ్రీకాంత్, సంగిశెట్టి శివాజీ, ఎండి ఆరిఫ్, బిక్షం ఐలయ్య, పాపయ్య అంజయ్య, యాదయ్య, ముత్తయ్య పాల్గొనడం జరిగింది.

## ఆగస్టు 10న జరిగే జైల్ బరోకార్యక్రమాని విజయవంతం చెయ్యండి

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 09:**

సిఐటియు రామన్నపేట మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోరిగే సోములు మాట్లాడుతూ నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా 26వేల వేతనం ప్రభుత్వం అమలుపరచాలి. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలి. నూతనంగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నకరికంటి రాము జిల్లా కమిటీ సభ్యులు అప్పం సురేందర్, వంగల



మారయ్య, బుద్ద ప్రసాద్, జంపాల మహేష్, నూనె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్స్ సేవా కార్యక్రమాలకు గుర్తింపు

**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 09:**

నార్కట్‌పల్లి వాసవి భవన్‌లో ఆదివారం మహీక జోన్ సోషల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమాన్ని జోన్ చైర్మన్ ఉప్పల శివకృష్ణ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డైమండ్ స్టార్ కె.సి.జి.ఎఫ్. వి.ఎన్. పబ్బతి వేణుమాధవ్, ఐపీసీ హాజరయ్యారు. గెస్ట్ ఆఫ్ హానర్‌గా వి.ఎన్.ఎల్. గుండా కరుణ, ఆర్.ఈ.సి. పాల్గొన్నారు.అలాగే రీజినల్ చైర్మన్ గుండా నరేందర్, జోన్ చైర్మన్ ఉప్పల శివకృష్ణ స్రవంతి, వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ నార్కట్‌పల్లి సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సేవా



కార్యక్రమాల ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి సత్కరించడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## మంగల్పేట్ లో వైభవంగా బోనాల జాతర

- **ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్ ఆగస్టు 09 (వెలుతురు):**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్ పేట్‌లో వెలసిన శ్రీ ఆరేళ్లి తల్లి బోనాల జాతర వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగాయి. ఈ వేడుకలకు గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీ ఆరేళ్లి తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మంగళ్ పేట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ




సభ్యులు గ్రామ ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌కు రిఫ్రిజిరేటర్ బహూకరణ



**మునుగోడు,ఆగస్టు 9(వెలుతురు):**

విద్యార్థినుల సౌకర్యార్థం మునుగోడులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల హాస్టల్‌కు రిఫ్రిజిరేటర్‌ను బహూకరించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మీ రాజ్‌గోపాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి తన సొంత నిధులతో రూ.20 వేల విలువైన రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన విద్యతోపాటు వసతి, ఆరోగ్యం,మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని అన్నారు.హాస్టల్ విద్యార్థినుల అవసరాలను గుర్తించి రిఫ్రిజిరేటర్ అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, వార్డు సభ్యుడు పందుల గంగాధర్, ఎండీ అన్వర్, కూరపాటి సాగర్, మార్నేని గ్రేగోరీ, వల్లంచట్ల రవి,ఉడత సత్యనారాయణ, రామినేని విజయ్, దుబ్బ ప్రభాకర్, బోయపర్తి ప్రసాద్, రాయల ప్రదీప్ పాల్గొన్నారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నూతనకల్ ఆగస్టు 9 (వెలుతురు):**

నూతనకల్ మండల కేంద్రములో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు పసుల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం కేక్ కట్ చేసి స్వీట్లు, బ్రేడ్ ప్యాకెట్ లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు కట్ట మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి విచ్చేసి వారు మాట్లాడుతూ దేశ రాజకీయాలలో యువతే కీలకం అని కాంగ్రెస్ పార్టీ గుర్తించి, యువకులను ప్రోత్సహిస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దరిపేల్లి వీరన్న, నకిరకంటి వెంకన్న, ఇమ్మరెడ్డి మహేష్ రెడ్డి,బండపల్లి సాగర్, చురకంటి చంద్రారెడ్డి, ఇరుగు కిరణ్, మద్దెల సురేందర్ గౌడ్, గ్రామ శాఖ అద్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య,బంటు క్రాంతి కుమార్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు మూడ్ మోహన్ నాయక్,బొల్లేద్దు నాగయ్య, బొల్లేపల్లి సాయి గౌడ్,గంగయ్య,మట్టి నరేష్,ఇటికాల మహేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బోరంచనల్ల పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 09 :**

:- నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోరంచ గ్రామంలో వేంచేసియున్న శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని ఆషాడ మాసం బోనాల సందర్భంగా గౌరవ నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాల మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ... ఆషాడ మాస బోనాల పండుగ మన తెలంగాణ సంస్కృతికి, విశిష్ట సాంప్రదాయాలకు ప్రతీక. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి రైతన్నలు సంతోషంగా ఉండాలని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని వేడుకున్నాను. నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి కృపాకటాక్షాలు



ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించాడం" జరిగింది .ఈ కార్యక్రమంలో భోజీ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, బీరప్ప కురుమ సర్పంచ్,మల్లప్ప ఆలయ చైర్మెన్,శివ రుద్రప్ప ఆలయాధికారి,అఖిలేష్ రెడ్డి,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ముత్యాల శివ మృతి

- **కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు**
- **గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ప్రధాన అనుచరుడు ఇక లేరు**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 09:**

శోక సంద్రంలో నీర్నంల గ్రామ వాసులు నీర్నంల గ్రామానికి చెందిన ముత్యాల శివ తన వ్యక్తిగత పనుల రీత్యా చిట్యాల రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు చెప్పడం జరిగింది. ముత్యాల శివ వ్యక్తిగత జీవితం మాదిగ సామాజిక వర్గానికి చెందిన ముత్యాల శివ వృత్తిరీత్యా మేస్త్రి పని చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత కొద్ది సంవత్సరాల క్రితం వారి సోదరుడు ముత్యాల నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. వీరు ముగ్గురు అన్నదమ్ములు ఒక చెల్లి కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టాలకు వచ్చి ఎన్నో బాధలు అనుభవిస్తూ మేస్త్రి పని నేర్చుకొని ఎంతో సిన్సియర్గా మంచి మేస్త్రిగా గుర్తింపు తెచ్చుకుని ఈ ప్రాంతంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. చిన్ననాటి నుంచే కాంగ్రెస్ పార్టీ యువజన నాయకునిగా కొనసాగుతూ ఉండేవారు. ప్రధానంగా గత 15 సంవత్సరాల నుంచి గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ప్రధాన అనుచరునిగా కొనసాగుతూ ఉంటున్నాడు. కందిమల్ల గోపాల్ రెడ్డి గ్రామ సర్పంచ్ ఎన్నికల గెలుపులో కీలకపాత్ర పోషించినారు. గ్రామంలో ఎంతో మంది పేదరికంలో చనిపోయిన వారికి కందిమల్ల ఫౌండేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం తన గురువును ఒప్పించి ప్రజలకు మీ యొక్క సేవలు చాలా అవసరం అని కందిమల్ల ఫౌండేషన్ ద్వారా గ్రామంలో ఆర్థిక సహాయం చేయిం చడంలో ముత్యాల శివది ప్రధాన పాత్ర ముక్కు సూటి మనిషిగా మంచి మానవత్వం ఉన్న మనిషిగా



న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తిగా కందిమల్ల గోపాల్ రెడ్డికి గ్రామ పౌరులకు ఆదర్శంగా ముత్యాల శివ నిలిచి నారు. దైవం ఒకటి తెలిస్తే కాలం మరొకటి తలచినట్టు రోడ్డు ప్రమాదంలో ముత్యాల వారి కుటుంబం నుంచి కందిమల్ల గోపాల్ రెడ్డి నుంచి దూరంగా తీసుకపోవడం చాలా విషాదకరమైన విషయ మని గ్రామస్తులు ఆయన యొక్క స్నేహితులు తెలిపినారు. ఏది ఏమైనా ఒక నిరుపేద కుటుం బంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సోదరులు 14 సంవత్సరాల లోపు మరణించడం చాలా బాధాకరం.

## కోమటిరెడ్డి లక్ష్మికి సర్పంచ్ దంపతుల శుభాకాంక్షలు



**మునుగోడు, ఆగస్టు 9(వెలుతురు):**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మికి మునుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నివాసంలో లక్ష్మిని కలిసిన సర్పంచ్ దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.ఆమె ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## పంట నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**మునుగోడు,ఆగస్ట్ 9 (వెలుతురు):**

తన పొలంలో పంటను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి మండలం నేమ్మాని గ్రామానికి చెందిన అలుగుబెల్లి గీత అధికారులను కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు కల్వకుంట్ల రెవెన్యూ పరిధిలో తనకు వారసత్వంగా వచ్చిన భూమిలో పంట సాగు చేస్తున్నామని తెలిపారు. కొంతకాలంగా భూమి



విషయంలో కొందరు తమను వేధిస్తున్నారని ఆరోపించారు. కావాలనే పంటను నష్టం చేశారని, పోలీసులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందన లేకపోవడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# యువ కవి సమ్మేళనంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- గంజాయి, డ్రగ్స్‌పై యువత అక్షర యుద్ధం ప్రారంభించాలి: మేయర్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 09:**



కరీంనగర్ నగరంలోని ఫిల్మ్ భవన్‌లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కవి సమ్మేళనం కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రచయితల సంఘానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కరీంనగర్ సాహిత్య చరిత్రలో తొలిసారిగా యువ కవులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఫిల్మ్ భవన్ వేదికగా ఈ యువ కవి సమ్మేళనం నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా, నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వ్యసనాలకు వ్యతిరేకంగా "యుద్ధం మొదలైంది" అనే అంశాన్ని ఎంచుకోవడం యువ కవుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. యువతను ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ, "నేను ఈ రోజు మీ ముందుకు ఒక మేయర్‌గా మాత్రమే రాలేదు, మీ మంచి కోరుకునే కుటుంబ సభ్యుడిగా వచ్చాను. నేటి యువత అనంతమైన శక్తిసామర్థ్యాలకు మారుపేరు. అయితే కొందరు స్నేహితుల ఒత్తిడి, క్షణికావేశం లేదా ఇతర కారణాలతో గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఒకసారి ఈ మత్తు రక్కసి కోరల్లో చిక్కుకుంటే, అది కేవలం శరీరాన్నే కాదు, బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను కూడా దహనం చేస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.మాదకద్రవ్యాలు కలిగించే మత్తు తాత్కాలికమైనదైనా, అవి మిగిల్చే నష్టం శాశ్వతమని అన్నారు. డ్రగ్ మాఫియా యువతను దారి మళ్లించి దేశ భవిష్యత్తును నాశనం చేయాలని ప్రయత్నిస్తోందని, అందుకే కరీంనగర్ నగరపాలక సంస్థ, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. అయితే కేవలం చట్టాల వల్ల మాత్రమే మార్పు రాదని, సమాజంలో ముఖ్యంగా యువతలో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.కవుల పాత్రను ప్రస్తావిస్తూ, "కత్తి కంటే కలం గొప్పది. ఒక కవి రాసే అక్షరం అనేక మంది యువత గుండెల్లో స్ఫూర్తిని నింపగలదు.



మీరు రాసే కవితలు కేవలం అక్షరాలు కాదు, సమాజాన్ని మేల్కొలిపే అస్త్రాలు. ఈ మత్తు రక్కసిపై సాగుతున్న అక్షర యుద్ధంలో మీరే మా సైనికులు. మీ కలాలు గర్జించాలి, మీ పదాలు యువతను సరైన దారిలో నడిపించే కరదీపికలు కావాలి" అని పిలుపునిచ్చారు. యువత తమ శక్తిని చదువు, క్రీడలు, కళలు, విజ్ఞానం, ఉపాధి, మరియు కెరీర్ నిర్మాణంపై కేంద్రీకరించాలని సూచించారు. డ్రగ్స్ లేని కరీంనగర్ నిర్మాణం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ యువ కవి సమ్మేళనం ద్వారా ప్రారంభమైన చైతన్య యుద్ధం సమాజంలో విస్తృత మార్పుకు దారితీయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు కొత్త అనిల్ కుమార్, కార్యదర్శి దొమ్మాటి శంకర్, కందూరి వెంకటేశ్వర్లు, కె ఎస్ అనంతా చార్య,యువ కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంను ఘనంగా సన్మానించిన రాంనగర్ మార్క్ ఫెడ్ అసోసియేషన్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 09:**

కరీంనగర్ పట్టణం రామ్‌నగర్ మార్క్‌ఫెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా నియమితులైన సాయిని మల్లేశంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రముఖులు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిని మల్లేశం కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ నగర్ మార్క్‌ఫెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ రావు, ప్రధాన కార్యదర్శి గిరి నరేందర్, అధిరెడ్డి వెంకటేశం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కరీం నగర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో పలు అసోసియేషన్ల బాధ్యులు, బిజెపి నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశంను ఘనంగా సన్మానించారు.

**తెలంగాణ సాంప్రదాయానికి ప్రతిక బోనాలు**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి , వైభవానికి ప్రతీకగా బోనాలు నిలుస్తాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. ఆదివారం రోజున కరీంనగర్ పట్టణం కొత్త యస్వాడ లో జరిగిన బోనాల వేడుకల్లో జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పాల్గొన్నారు. అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని సాయిని మల్లేశం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొత్త యస్వాడ స్థానికులు నూతన జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సాయిని



మల్లేశం ను ఘనంగా సన్మానించారు.

**బిజెపి ఈస్ట్ జోన్ అధ్యక్షునికి పరామర్శ**

బిజెపి ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందారు. ఆదివారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

# అంగరంగ వైభవంగా హౌసింగ్ బోర్డు కాలనీలో పోచమ్మ బోనాలు

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపులో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై అలంకరించిన బోనాలతో పాల్గొన్నారు. డప్పు, మంగళ వాయిద్యాల నడుమ పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.కాలనీ మొత్తం పండగ వాతావరణాన్ని సంతరించుకోగా, ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, హౌసింగ్ బోర్డు కాలనీ మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అశోక్ నగర్‌లో ఘనంగా బోనాలు

- వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గొట్టే ముక్కల ఉమ రాణి వెంకటరమణ

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 09:**

అశోక్ నగర్ ప్రాంతంలో బోనాల పండుగ వేడుకలుఆదివారం రోజున అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ గొట్టే ముక్కల ఉమరాణి వెంకటరమణ ఉత్సాహంగా పాల్గొని, అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ అంతటా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో, తలపై బోనాలతో బారులు తీరి ఘనంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పు చప్పుళ్లు, కళాకారుల విన్యాసాలు మరియు పోతరాజుల నృత్యాలతో అశోక్ నగర్ వీధులు మార్మోగాయి.కార్పొరేటర్ ఉమ వెంకటరమణ మాట్లాడుతూతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రజలంతా కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పదనానికి నిదర్శనమని పేర్కొన్నారు. మహాకాళీ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, కాలనీ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# నగరంలో బోనాల ఉత్సవాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ ఆగస్టు 09 (వెలుతురు):**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ గారు అమ్మవారికి బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో ఈ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, కార్పొరేటర్లు మాసం గణేష్ గారు, చొప్పరి జయశ్రీ గారు, సొగాని కొమరయ్య గారు, నలువాల రవీందర్ గారు, పొన్నం లక్ష్మీ మొండయ్య గారు, ఇతర ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఖేడ్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాది మొహీద్ పటేల్

**నారాయణఖేడ్ ఆగస్టు 09 (వెలుతురు) :**

నారాయణఖేడ్ బోనాల పండుగ సందర్భంగా శనివారం నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షుడు, న్యాయవాది మొహీద్ పటేల్ నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ప్రత్యేక ఉత్సవాలని అన్నారు. ఈ పండుగను జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నారాయణఖేడ్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర ప్రేమ, సోదర భావం, ఐక్యతతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ ప్రజల జీవితాల్లో ఆరోగ్యం, ఆనందాన్ని తీసుకురావాలని న్యాయవాది మొహీద్ పటేల్ ఆకాంక్షించారు.



# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నామ రవికిరణ్ ఘన విజయం

- 77 ఓట్ల మెజార్టీతో గెలుపు.. ప్రధాన కార్యదర్శి, కోశాధికారులుగా శ్రీనివాస్ గుప్తాలు...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు రసవత్తరంగా సాగగా, మాజీ కౌన్సిలర్, ఆర్యవైశ్య సంఘం మాజీ కార్యదర్శి నామ రవికిరణ్ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలుపై 77 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.సంఘం ఎన్నికల్లో మొత్తం 314 ఓట్లకు గాను 303 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో నామ రవికిరణ్‌కు 189 ఓట్లు, అల్లాడి నర్సింలుకు 112 ఓట్లు లభించాయి. దీంతో నామ రవికిరణ్ 77 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి వెంకటేశ్ అధికారికంగా ప్రకటించారు.నామ





రవికిరణ్ ప్యానెల్ నుంచి బడిశెట్టి శ్రీనివాస్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా, బడంపేట్ శ్రీనివాస్ గుప్తా కోశాధికారిగా విజయం సాధించారు. ఫలితాలు వెలువడిన అనంతరం రవికిరణ్ అనుచరులు, సంఘ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.విజయం అనంతరం నామ రవికిరణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఘన విజయాన్ని అందించిన ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ స్నేహపూర్వకంగా, న్యాయబద్ధంగా జరిగిందని పేర్కొన్నారు. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా' అభియాన్ - విజయవంతం చేయాలి..

- ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఏగరాలి...
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపు

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 09:**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేసేందుకు తగిన కృషి చేయాలని , ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా బిజెపి శ్రేణులు తగిన కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. హర్ఘర్ తిరంగా అభియాన్ ప్రో గ్రాం పురస్కరించుకుని బిజెపి మండల, జోన్ అధ్యక్షులతో , పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం రోజున కరీంనగర్లోని శుభ మంగళ కన్వెన్షన్ హాల్లో సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రామ్‌లు ఈ నెల 10 నుండి ప్రారంభం కానున్నాయన్నారు.. మండల పార్టీల ఆధ్వర్యంలో తిరంగా కార్యక్రమాలను మరియు 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషులు మరియు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులను కోరారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని, ప్రతి ఏటా ఇది ఘనంగా జరుగుతోందని గుర్తు చేశారు.మన జాతీయ పతాకం త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు ,అఖండతకు ప్రతీక. జిల్లాలో దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూసి 'హర్ ఘర్ తిరంగా'





అభియాన్‌ను విజయం చేయాలని ఆయన కోరారు. అనంతరం బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగాని శ్రీనివాస్ ,రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు, బాస సత్యనారాయణ రావు, కన్న బోయిన ఓదెలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ లతో పాటు జిల్లా ముఖ్యనేతలు, మండలాల, జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని అనంతరం నూతన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ను, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లను బిజెపి శ్రేణులు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# పల్లె వంశీ కృష్ణ గౌడ్ ని సన్మానించిన పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు

**దుబ్బాక వెలుతురు ఆగస్టు 09:**

SIR (ప్రత్యేక ఓటరు సవరణ) ప్రక్రియలో దుబ్బాక నియోజకవర్గం రాష్ట్రంలోనే అన్ని నియోజకవర్గాల కన్నా ముందుగా వంద శాతం (100 %) పూర్తిచేసుకున్న సందర్భంగా ,SIR బీజేపీ దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త పల్లె వంశీ కృష్ణ గౌడ్ ను సన్మానించడం జరిగింది, ఈ సందర్భంగా మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారు మాట్లాడుతూ ,తన బాధ్యతలను దుబ్బాక నియోజకవర్గం లో విజయవంతంగా నిర్వర్తించినందుకే ఈ సత్కారం అన్నారు, రాష్ట్రంలోనే ఆదర్శంగా దుబ్బాక నియోజకవర్గం నిలవడం స్ఫూర్తిదాయకం అన్నారు,మొదటి నుండి SIR ప్రక్రియలో దుబ్బాక నియోజకవర్గం జిల్లాలో ముందంజలో ఉండటమే కాకుండా, రాష్ట్రంలోనే వంద శాతం (100%)పూర్తి చేసుకున్న మొదటి నియోజకవర్గంగా దుబ్బాక ఉండడం గొప్ప విషయం అన్నారు, BLO (అంగన్వాడీ టీచర్లు), అధికారుల కృషి చాలా గొప్పదని అన్నారు ,వారు రేయింబవళ్ళు పని చేయడం వల్లే ఇది సాధ్యమయింది అన్నారు, వారికి తోడుగా ప్రతి బూత్లో బీజేపీ ఏజెంట్లు( BLA 01)బిజెపి నాయకులు బూత్,మండలం మొదలు కొని



నియోజకవర్గం లోని అన్ని శ్రేణుల నాయకుల కృషి ఫలితమే ఈ విజయం అన్నారు,ఇదే స్ఫూర్తి తోటి నూతన ఓటర్ల నమోదు ప్రక్రియలో కూడా ముందంజలో ఉండాలని కోరారు, ఈ సంవత్సరం అక్టోబర్ 1 తేదీ వరకు 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకుల నూతన ఓటు హక్కు నమోదు ప్రక్రియను నాయకులందరూ ముందుండి చేయించాలని కోరారు, అలాగే అడ్రస్ మార్పు, బూత్ మార్పు, పేర్లలో తప్పు ఒప్పుల సవరణ కోసం కూడా రాబోయే రోజుల్లో SIR రెండవ దశలో నాయకులందరూ ముందుండి పనిచేయాలని కోరారు, ఓటర్ ఇంటికి వెళ్లి సేవ చేసినప్పుడే నాయకునిగా గుర్తింపు వస్తుందని, రాబోయే రోజుల్లో నూతన నాయకత్వానికి ఇది మంచి అవకాశం గా తీసుకొని ముందుకు సాగాలని కోరారు, ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజు గారు, రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ గారు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు భూరెడ్డి విభీషణ్ రెడ్డి గారు, నత్తి మల్లేష్ ముదిరాజ్ గారు, సిద్దిపేట BLA 01 జ్యోతి రెడ్డి గారు, , బొప్పాపూర్ సర్పంచ్ మాధవనేని భాను గారు, దుబ్బాక కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్ గౌడ్ గారు, నాయకులు పుల్లూరు రాజు, తాటికొండ శ్రీనివాస్ గారు తదితరులు పాల్గొన్నారు.

# క్యూబా బయలుదేరిన సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం

**కాస్ట్రో శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో..**


**న్యూఢిల్లీ వెలుతురు ఆగస్టు 09 :**

క్యూబా విప్లవ నేత ఫెడల్ కాస్ట్రో శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ఆదివారం క్యూబా బయలుదేరి వెళ్ళింది. హవానాలోని కన్వెన్షన్ ప్యాలస్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఏడాది పొడవునా జరిగిన క్యూబా కమాండర్ ఇన్ చీఫ్ ఫెడల్‌కాస్ట్రో శత జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంగా 'ఫెడల్ వారసత్వం, భవిష్యత్' అంశంపై అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఆ సదస్సులో పాల్గొనడంతో పాటూ ప్రతినిధి బృందం క్యూబాలోని కార్డియాక్ ఆస్పత్రిని, చిన్నారుల క్యాన్సర్ ఆస్పత్రిని కూడా సందర్శించనుంది. అణగారిన వర్గాల కోసం చేపట్టిన సామాజిక పథకమైన కార్మిక-రైతు సహకార సంఘాలను కూడా సీపీఐ(ఎం) బృందం పరిశీలించనుంది. అలాగే ఫెడల్ కాస్ట్రో సెంటర్, చెగువేరా సెంటర్, క్యూబా విప్లవంతో ముడిపడిన చారిత్రక ప్రదేశాలను కూడా ఈ బృందం సందర్శించనుంది. ఈ నెల 19న ఈ బృంది తిరిగి భారత్‌కు రానుంది.క్యూబాకు బయలుదేరిన ఈ బృందం క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు అవసరమైన ఔషధాలను పెద్ద మొత్తంలో తీసుకెళుతోంది. క్యూబన్లకు సంఘీభావంగా సీపీఐ(ఎం), సీపీఐలు ఈ మందులను సేకరించాయి. అమెరికా సామ్రాజ్యవాద దురహంకార ప్రభుత్వం అక్రమంగా అమలు చేస్తున్న ఆంక్షలతో క్యూబా తీవ్ర మానవతావాద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. క్యూబాకు, క్యూబా ప్రజలకు అంతర్జాతీయ సంఘీభావాన్ని పునరుద్ధరించడానికి, మరింత బలోపేతం చేయడానికి ఫెడల్ కాస్ట్రో శత జయంతి కూడా ముఖ్యమైన సందర్భంగా ఉంది.c సీపీఐ(ఎం) ప్రతినిధి బృందంలో పొలిట్‌బ్యూరో సభ్యులు విజ్జూ కృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యురాలు పి.కె.శ్రీమతి, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మీనాక్షి సుందరం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ధర్మరాజ్ మహాపాత్ర, కేరళం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.చంద్రన్, వ్యవసాయ సబ్ కమిటీ సభ్యులు బి.వెంకట్, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఫ్రాక్షన్ మెంబర్ అనీల్ ఎస్ఎస్ ఉన్నారు. క్యూబా డిప్యూటీ రాయబారి రెగ్లా ఫ్రామెటా గోమెజ్ న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ ప్రతినిధి బృంద సభ్యులకు వీడ్కోలు పలికారు.

# ఉమర్ ఖలీద్ పుస్తకంపై చర్చకు నో

- **జేఎన్‌యూ అనుమతి నిరాకరణ**
- **విద్యార్థి సంఘం ఆగ్రహం**

**న్యూఢిల్లీ వెలుతురు ఆగస్టు 09 :**




సామాజిక కార్యకర్త, మాజీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్ పుస్తకంపై చర్చ జరిపేందుకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జేఎన్‌యూ) అనుమతి నిరాకరించింది. ఉమర్ ఖలీద్ రచించిన 'ఫ్రాక్చర్డ్ కమ్యూనిటీస్: ఆదివాసి హిస్టరీస్ అండ్ ది పాలిటిక్స్ ఆఫ్ పవర్' అనే పుస్తకంపై జరగాల్సిన చర్చా కార్యక్రమం కోసం ఆడిటోరియం బుకింగ్‌ను రద్దు చేసినట్టు జేఎన్‌యూ తెలిపింది. ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా.. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (ఎస్ఎస్ఎస్-1) ఆడిటోరియంలో ఈ చర్చా కార్యక్రమం జరగాల్సి వుంది. "కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించకపోవడం వల్ల ఎస్ఎస్ఎస్-1 ఆడిటోరియం బుకింగ్‌ను రద్దు చేశాం " అని జేఎన్‌యూ ఆదివారం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. జేఎన్‌యూ ఒక "ప్రజాస్వామ్య మరియు వికేంద్రీకృత సంస్థ" అని, దీనికి సంబంధించిన అనుమతిని ఎస్ఎస్ఎస్ డీన్ మంజూరు చేశారని, ఆ తర్వాత ఆయనే ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తూ చర్యలు తీసుకున్నారని విశ్వవిద్యాలయం తెలిపింది. ప్రొఫెసర్ అవినాష్ కుమార్ అధ్యక్షతన ప్రొఫెసర్ ప్రభు మహాపాత్ర, ప్రొఫెసర్ ఉమా చక్రవర్తి, శుద్ధబ్రత సేన్‌గుప్తా, హర్ష్ మందర్, బనోజ్యోత్స్న లహిరిలు ఈ పుస్తకంపై చర్చించనున్నట్టు ఈ కార్యక్రమ పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ ఆడిటోరియం బుకింగ్ ఆగస్టు 7న ఖరారైంది. అయితే, కార్యక్రమానికి సంబంధించి ఏ వివరాలను వెల్లడించలేదనే విషయంపై జేఎన్‌యూ స్పష్టతనివ్వలేదు. మత సంస్థలు క్యాంపస్‌ను వినియోగించడం యూనివర్శిటీ నిబంధనలను ఉల్లంఘించడమేనని జేఎన్‌యూ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో క్యాంపస్‌లో జరగాల్సిన ఇస్కాన్ కార్యక్రమాన్ని జేఎన్‌యూ రద్దు చేసింది. ఇది జరిగిన కొన్ని రోజులకే ఈకార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.జేఎన్‌యూ ఏకపక్ష, నిరంకుశ నిర్ణయాన్ని జేఎన్‌యూఎస్‌యూ ఖండించింది. యూనివర్శిటీ క్యాంపస్‌లో పుస్తకంపై చర్చించడం అనేది విద్యా సంస్కృతిలో, ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక భాగమని జేఎన్‌యూఎస్‌యూ ఒక ప్రకటనలో పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమానికి వేదికను రద్దు చేయడం ద్వారా, జేఎన్‌యూ యంత్రాంగం మరోసారి తన విద్యార్థి వ్యతిరేక, మేధో వ్యతిరేక ఎజెండాను బయటపెట్టిందని మండిపడింది. "బుకింగ్ సమయంలో పూర్తి వివరాలు ఇవ్వలేదు" అని జేఎన్‌యూ పేర్కొనడం కేవలం ఒక సాకు మాత్రమేనని, అసలు ఉద్దేశ్యం చర్చను అడ్డుకోవడమేనని ఆరోపించింది. ఇతర కార్యక్రమాలకు, ముఖ్యంగా ఇస్కాన్ కార్యక్రమాలకు యాజమాన్యం సహకరిస్తున్నప్పుడు, ఈ విద్యాపరమైన చర్చకు మాత్రం స్థలం నిరాకరించడం ద్వంద్వ ప్రమాణమని విమర్శించింది. "విద్యార్థుల కార్యక్రమాలకు నిబంధనలు, అర్హతలు అంటూ కఠినంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం, తన స్వంత ఫ్యాకల్టీ నియామకా ల విషయంలో కూడా అదే నిబంధనలను కచ్చితంగా పాటించిందా? అని జేఎన్‌యూఎస్‌యూ నిలదీసింది. రిపోర్టర్స్ కలెక్టివ్ ప్రచురించిన, జర్నలిస్ట్ అలోక్ రాజ్‌పుత్ చేసిన ఒక ఇటీవలి పరిశోధనాత్మక నివేదిక, ప్రస్తుత వైస్ ఛాన్సలర్ పదవీకాలంలో అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయిలలో జరిగిన అనేక ఫ్యాకల్టీ నియామకాలను ఆందోళనలను లేవనెత్తిన సంగతి తెలిసిందే. నియమితులైన వ్యక్తులు ఆ ఉద్యోగ ప్రకటనల్లో పేర్కొన్న కనీస బోధనా అనుభవం, ప్రచురణల అర్హతలను అందుకోలేదని తేలిందని జేఎన్‌యూఎస్‌యూ పేర్కొంది. ఆదివాసీల జల్-జంగల్-జమీన్ పోరాటాలపై ఉన్న పుస్తకాన్ని చర్చించకుండా అడ్డుకోవడం విద్యా స్వేచ్ఛకు, చర్చా స్వేచ్ఛకు వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఆడిటోరియంను కేటాయించకపోయినా బహిరంగ ప్రదేశంలో చర్చను కొనసాగిస్తామని పేర్కొంది. తెలుసుకునే, చర్చించే తమ హక్కును కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# కృష్ణా నది ఒడ్డుకు చేరిన భారీ మొసలికి భయం లేకుండా ప్రత్యేక పూజలు నిర్వహించిన బీచుపల్లి పురోహితుడు



**జోగులాంబ గద్వాల వెలుతురు ఆగస్టు 09 :**

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని కృష్ణా నది పుష్కర ఘాట్ వద్ద ఒక అత్యంత ఆశ్చర్యకరమైన ఘటన వెలుగుచూసింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో, వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఒక భారీ మొసలి హఠాత్తుగా నది ఒడ్డుకు చేరుకుంది. సెలవు రోజు కావడంతో నదీ తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్కసారిగా అంత పెద్ద క్రూర జంతువును ఒడ్డున చూసి భక్తులందరూ తీవ్ర భయాందోళనలతో చెల్లాచెదురుగా పరుగులు తీశారు. అయితే అక్కడే పితృకార్యాలు, అపరకర్మలు నిర్వహించే పురోహితుడు అనిల్ శర్మ మాత్రం ఆ మొసలిని చూసి అస్సలు భయపడలేదు. హిందూ సంప్రదాయాల ప్రకారం మొసలిని వర్షాల దేవుడైన వరుణ దేవునికి, గంగా దేవికి వాహనంగా భావిస్తారు. ఆ నమ్మకంతోనే ఆయన ఆ క్రూర జంతువుకు అత్యంత సమీపంలోకి వెళ్లారు. మొసలి ముందే నేలపై కూర్చుని మంత్రాలు పఠిస్తూ.. దానికి పసుపు, కుంకుమలు సమర్పించి, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, లోకం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఆయన ఈ వింత క్రతువును పూర్తి చేశారు. పూజారి పూజలు చేస్తున్నంత సేపు ఆ మొసలి కూడా కదలకుండా ప్రశాంతంగా ఒకే చోట కూర్చోవడం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ లోగా స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పూజలు ముగిసిన వెంటనే అటవీ సిబ్బంది స్థానిక మత్స్యకారుల సహాయంతో ఆ మొసలిని జాగ్రత్తగా తాడుతో బంధించి, తిరిగి కృష్ణా నదిలోనే సురక్షితంగా విడిచిపెట్టారు. ప్రాణాలకు తెగించి పురోహితుడు మొసలికి పూజలు చేసిన ఈ వినూత్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అత్యంత వేగంగా వైరల్ అవుతున్నాయి.

# గుజరాత్‌లో దారుణం: అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై మహిళపై సెక్యూరిటీ గార్డ్ అత్యాచారం

- **విధుల్లో చేరిన నాలుగు రోజులకే దారుణానికి ఒడిగట్టిన నిందితుడు ధరం సింగ్**

**అహ్మదాబాద్ వెలుతురు ఆగస్టు 09 :**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ హౌసింగ్ సొసైటీలో సెక్యూరిటీ గార్డ్‌గా చేరిన నాలుగు రోజులకే ఓ మహిళా టెనెంట్‌పై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడి పూర్వాపరాలను పరిశీలించకుండా విధుల్లోకి తీసుకున్న సెక్యూరిటీ ఏజెన్సీ నిర్లక్ష్యం కూడా ఈ ఘటనతో బహిర్గతమైంది.జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నీరజ్ బాద్గుజర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాకు చెందిన ధరం సింగ్ అనే వ్యక్తి ఆనంద్ నగర్ ప్రాంతంలోని ఒక హౌసింగ్ సొసైటీలో ఇటీవల సెక్యూరిటీ గార్డ్‌గా చేరాడు. శనివారం రాత్రి సదరు మహిళ వాకింగ్ కోసం అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లిన సమయంలో నిందితుడు ఆమెను అనుసరించాడు. బాధితురాలి గొంతు నులిమి భయభ్రాంతులకు గురిచేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను టెర్రస్‌పైనే బంధించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దృశ్యాలు భవనంలోని సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి.ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు, లోకల్ క్రైమ్ బ్రాంచ్ మరియు క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన సిబ్బందితో కలిపి 10 బృందాలను రంగంలోకి దించారు. నిందితుడు తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య హెబత్‌పూర్ ప్రాంతం సమీపంలో నిందితుడు ధరం సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు.కాగా, నిందితుడు గతంలో అహ్మదాబాద్‌లోని పలు కంపెనీల్లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అయితే సదరు సెక్యూరిటీ ఏజెన్సీ అతని వివరాలను సరిగ్గా తనిఖీ చేయకుండా, ఎలాంటి ప్రాథమిక శిక్షణ ఇవ్వకుండా విధుల్లోకి తీసుకున్నట్లు తేలింది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సెక్యూరిటీ ఏజెన్సీపై కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జేసీపీ వెల్లడించారు. భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి, క్లూస్ టీమ్, ఎఫ్ఎస్ఎల్ బృందాల ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితుడు, బాధితురాలికి వైద్య పరీక్షలతో పాటు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో BRAOU ప్రవేశాల గడువు పొడిగింపు

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 09:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (BRAOU) స్టడీ సెంటర్–172 ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి బి.ఏ., బి.కాం., బి.ఎస్సీ. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువును సెప్టెంబర్ 9, 2026 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక తెలిపారు.ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్ (NIOS /APOSS/TSOSS) ఉత్తీర్ణులతో పాటు SSC తర్వాత రెండేళ్ల ITI కోర్సు పూర్తి చేసిన వారు ఈ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు అర్హులని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇప్పటికే ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ట్యూషన్ ఫీజును గడువులోగా చెల్లించి తమ విద్యను కొనసాగించాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇబ్రహీంపట్నం, పరిసర ప్రాంతాల విద్యార్థులు

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని BRAOU స్టడీ సెంటర్–172 కోఆర్డినేటర్ డా. ఈ. శంకర్ సూచించారు. వెబ్‌సైట్: www.braou-online.in మరింత సమాచారం కోసం: 7382929772

# బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 09:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని బాచుపల్లి, నిజాంపేట్ 2BHK , బండారి లేఔట్, మల్లంపేట్ ప్రాంతాల్లోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ, శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని, నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధి, సౌభ్రాతృత్వం మరింతగా వెల్లివిరియాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు



స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..311 మందిపై కేసులు

**సైబరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP అడ్మిన్, జి నరేందర తెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 311 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.238 ద్విచక్ర వాహనదారులు,16 ఆటోలు,56 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —255 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -38 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -18 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (03.08.2026 – 08.08.2026) లో283




డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.01 మందికి జరిమానా, జైలు శిక్ష, 11 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,271 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# కోమటి రెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి గారినీ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**

కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి గారినీ , మును గోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారిని హైదరాబాదులోని వారి వాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సుశీలమ్మ పౌండే షన్ చైర్మన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి చండూర్ మున్సిపాలి టీ కాంగ్రెస్ పార్టీ నాయకులుమును గోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మును గోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నంత చంద్రశేఖర్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సతీమణి సుశీలమ్మ పౌండేషన్ చైర్మన్ లక్ష్మి రాజగోపాల్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి సుశీలమ్మ పౌండేషన్ ద్వారా పేద ప్రజలకు సేవ చేయాలని కోరారు.





# చార్మినార్ భాగ్యలక్ష్మి, లాల్‌దర్వాజా శ్రీ మహంకాళి అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:**





చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం మరియు లాల్‌దర్వాజా శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ సిటీ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు.అనంతరం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర ప్రముఖులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులు వారికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అతిథులు అక్కడ భోజనం చేసి, తాంబూలాలు స్వీకరించి అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు లుహరికలవేణుగోల్ గారు, ప్రభుత్వ సలహాదారు వి.హెచ్. అన్మంత్రావు గారు, ఫిరోజ్ ఖాన్ గారు గారు తదితరులు పాల్గొని కొప్పుల ప్రవీణ్ కుమార్‌ను కలిసి ఆత్మీయంగా మాట్లాడి అనంతరం బయలుదేరారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, "అమ్మవార్ల ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రముఖ నాయకులు మా నివాసానికి విచ్చేసి ఆత్మీయంగా గడపడం ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు.



# ప్రజా సమస్యలపై స్పందించని అధికారులపై కఠిన చర్యలు

- పానగల్ విద్యుత్ ఈఈకి మెమో జారీ చేయాలని ఆదేశం
- స్థానికుల ఫిర్యాదుపై సీఎండీకి ఫోన్ చేసిన మంత్రి జూపల్లి

**పానగల్ వెలుతురు ఆగస్టు 09:**

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులపై కఠిన చర్యలు తప్పవని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల విద్యుత్ శాఖ ఈఈ భగవంత్ ప్రజా సమస్యలపై స్పందించడం లేదంటూ స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.పలు మార్లు ఈఈకి ఫోన్ చేసినా స్పందించడం లేదని, విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు మంత్రికి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.దీనిపై మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే స్పందించారు. విద్యుత్ శాఖ సీఎండీకి ఫోన్ చేసి విషయం వివరించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పానగల్ విద్యుత్ శాఖ ఈఈ భగవంత్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఈకి మెమో జారీ చేయాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు తక్షణమే స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు



అందుబాటులో ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

# ఉప్పల్, పీర్జాదిగూడ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- మంత్రికి ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు, ప్రజలు

**ఉప్పల్ వెలుతురు ఆగస్టు 09:**

ఉప్పల్ నియోజకవర్గం పీర్జాదిగూడలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పండుగ వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రి గారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, మరియు ప్రజలు ఆత్మీయంగా, అత్యంత ఘనంగా స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య పండుగ వాతావరణం మరింత అంబరాన్నంటింది. అనంతరం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న మంత్రి గారు.. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో , పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకైన ఈ బోనాల ఉత్సవాల్లో స్థానిక ప్రజలతో మమేకం అవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



# అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు.. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం మొక్కులు

- బోనాల జాతరలో సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 9:**



ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు నగరంలో ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భం గా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉజ్జయిని మహంకాళి, సుల్తాన్ షాహి, లాల్‌దర్వాజా, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

# డిడిగి గ్రామంలో ఘనంగా ఉరడమ్మ తల్లి బోనాల ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గ్రామ సర్పంచ్ జగదాంబ సోమప్ప...
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు...

**జహీరాబాద్, వెలుతురు, ఆగస్టు 09:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం డిడిగి గ్రామంలో శ్రీ ఉరడమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అత్యంత వైభవంగా జరిగిన వేడుకల్లో మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గ్రామ సర్పంచ్ జగదాంబ సోమప్ప, సర్పంచ్ ప్రతినిధి టేకురి సోమప్ప పాల్గొని ఉరడమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఉరడ మ్మ తల్లిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# సిపిఎస్ రద్దు పిఆర్ సి అమలు కోసం తపస్ పోరాటం

- జిల్లా అధ్యక్షులు దత్తాత్రి

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 09 :**

సంగారెడ్డి జిల్లా :– తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ( టి పి యు ఎస్) నారాయణ ఖేడ్ డివిజన్ సమావేశం స్థానిక శిశుమందిర్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన తపస్ జిల్లా అధ్యక్షులు దత్తాత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, పి ఆర్ సి వెంటనే ప్రకటించి, డి ఎ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ,ముఖ్య మంత్రి గారి ప్రధాన ఎన్నికల హామీ ఐయిన సిపిఎస్ రద్దును పూర్తిగా మర్చిపోయారని అన్నారు.ప్రి ప్రైమరీ బడులల్లో కొత్త నియామకాలు పూర్తి చేయాలని కోరారు. లేదంటే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త ఇప్పటి వరకు 20 వేల మొక్కలు స్వయంగా నాటి మంజీరా పరివాహక ప్రాంతంలో మొక్కలు నాటుతూ ప్లాస్టిక్




తొలిగిస్తున్న మన ప్రాంత వాసి జ్ఞానేశ్వర్ ను టి పి యు ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసారు.లేదంటే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ఇందులో రాష్ట్ర సేవ కో కన్వీనర్ చంద్రశేఖర్ ఆచార్య ,జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రకాంత్,జిల్లా బాధ్యులు వినయ్,రాజయ్య, రాజశేఖర్, ఇతర బాధ్యులు రతన్ సింగ్, మచ్చందర్,మహేశ్,పద్మ నాభం, రాజు, జగదీశ్వర్, లు పాల్గొన్నారు.

# బోనాల పర్వదినాన అమ్మవారి ఆలయాల్లో జిల్లా గణేష్ నేత ప్రత్యేక పూజలు

**కూకట్ పల్లి ఆగస్టు 09 వెలుతురు:**

బోనాల పండుగ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆల్విన్ కాలనీ, తులసీనగర్, సాయినగర్, ఎన్టీఆర్ నగర్, పంచమి కాలనీ, పాపమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, జయశంకర్ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, శంషిగూడ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాలను ఆయన సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృప, ఆశీస్సులు శంషిగూడతో పాటు ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్వరూప్, వెంకటకృష్ణ, సాయి, మహేష్, వాసు, సంగమేష్, రవీందర్, యాదగిరి, శ్రీనివాస్, రాజు, నాగరాజు, మల్లేష్‌తో పాటు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సేవగా మలచాలి: గౌడ్ ప్రజాప్రతినిధులకు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పిలుపు

- **ఖమ్మం జిల్లా గోపా ఆధ్వర్యంలో సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లకు ఘన సన్మానం**

**ఖమ్మం వెలుతురు ఆగస్టు 09:**

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పదవిగా కాకుండా బాధ్యతగా భావించి, అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలని గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఖమ్మం జిల్లా గోపా ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లుగా ఎన్నికైన గౌడ్ ప్రజాప్రతినిధులకు ఆదివారం ఖమ్మం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

### అందివచ్చిన అవకాశంతో అందరికీ సేవ చేయాలి

ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ "అందివచ్చిన అవకాశంతో అందరికీ సేవ చేద్దాం" అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పదవి శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవ మాత్రమే చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధితో పాటు విద్య, ఉపాధి, మౌలిక వసతులు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

### అవకాశం వచ్చినప్పుడు నిలుపుకొని పనిచేయాలి

కార్యక్రమ ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ మాట్లాడుతూ, "అవకాశం వచ్చినప్పుడు దానిని నిలుపుకొని సమర్థవంతంగా పనిచేయాలి" అన్నారు. ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

### నాయకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, "నాయకత్వాన్ని సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన పాలన అందించాలి" అన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

### పార్టీలు ఇచ్చిన అవకాశాలను నిలబెట్టుకోవాలి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులకు కల్పించిన అవకాశాలను నిలబెట్టుకొని ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పనిచేయాలని సూచించారు. ప్రజల మన్ననలు పొందే విధంగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పాలన అందించాలని కోరారు.

### ఘనంగా సన్మానం

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లుగా ఎన్నికైన గౌడ్ ప్రజాప్రతినిధులను గోపా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒకే వేదికపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గౌడ్ ప్రజాప్రతినిధులను సత్కరించడం విశేషంగా నిలిచింది.

కార్యక్రమానికి డాక్టర్ బొల్లికొండ శ్రీనివాస్ రావు గౌడ్ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిద శ్రీనివాస్ గౌడ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోపా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా గోపా ప్రధాన



కార్యదర్శి బొలగాని శ్రీనివాస్ రావు గౌడ్, జిల్లా గోపా కోశాధికారి యాదగిరి గౌడ్, జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, అమరగాని వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, గోపా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజాసేవలో నూతనంగా అడుగుపెట్టిన ప్రజాప్రతినిధులకు ఈ సన్మాన కార్యక్రమం ప్రోత్సాహాన్ని, నూతన ఉత్సాహాన్ని అందించింది.





# అశ్వరావుపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు.విగ్రహావిష్కరణ సందర్భంగా అశ్వరావుపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు, స్థానిక ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. జై ఆదివాసీ నినాదాలతో అశ్వరావుపేట మారుమోగింది. అనంతరం జరిగిన సభలో మంత్రి సీతక్క ఆదివాసీల హక్కులు, చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి అంశాలపై మాట్లాడారు.ఆదివాసుల చరిత్ర పోరాటాల చరిత్రఅడవిలో మన పూర్వీకులు జీవనం ప్రారంభించిన నాటి నుంచి ప్రకృతితో మమేకమై జీవిస్తూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని మంత్రి సీతక్క అన్నారు. కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క, సారక్క నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సా ముండా, రాంజీ గోండు వరకు, నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కొమరం భీమ్ వరకు ఆదివాసీలు పోరాటాల్లో ముందుండారని గుర్తు చేశారు.ఆ పోరాటాలు కేవలం వ్యక్తుల కోసం జరిగినవి కావని, తమ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటాలని అన్నారు. ఈ పోరాటాల్లో అనేక మంది ప్రాణత్యాగాలు చేసినప్పటికీ ఆదివాసీ సమాజానికి రావాల్సిన ఫలితాలు పూర్తిస్థాయిలో దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడుతూ, త్యాగాలు చేస్తూ ఆదివాసీ సమాజం ఇక్కడి వరకు వచ్చిందన్నారు.రాజ్యాంగ హక్కులను కాపాడాలిఆదివాసీల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు కల్పించిందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఐదవ షెడ్యూల్, ఈశాన్య రాష్ట్రాలకు ఆరవ షెడ్యూల్ ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించారని తెలిపారు.అయితే రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుపై అధికారులకు సరైన అవగాహన లేకపోవడం, కొన్ని సందర్భాల్లో నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడం వల్ల ఆదివాసీలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ప్రభుత్వం అమలు చేయాల్సిన బాధ్యత ఉందని, ఆ బాధ్యతకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఆదివాసీ హక్కుల కోసం పోరాడటం అంటే ఇతర వర్గాలను, ఇతర ప్రాంతాల ప్రజలను వ్యతిరేకించడం కాదని మంత్రి సీతక్క అన్నారు. తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని, ఏ కులాన్ని ద్వేషించాల్సిన అవసరం లేదని ఆదివాసీ సోదరులకు సూచించారు. ఇతరులతో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లలా కలిసి ఉంటూనే రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.మన్యంలో ఇప్పటికీ అల్లూరి సీతారామరాజును ప్రజలు గౌరవంగా కొలుస్తున్నారని, ఆదివాసీ సమాజం ఎప్పుడూ ఎవరినీ వ్యతిరేకించలేదని అన్నారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూనే న్యాయంగా తమకు రావాల్సిన హక్కుల కోసం అడగాలని సూచించారు.ఆదివాసీల పట్ల వివక్షకు తావులేదుపేద ఆదివాసీలు తమ సమస్యలను చెప్పేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు అధికారులు వారిని గౌరవంగా చూడాలని మంత్రి సీతక్క అన్నారు. పేదలు, ధనికులు, సూటు బూటు వేసుకున్నవారు, సాధారణ దుస్తుల్లో వచ్చిన వారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని సూచించారు.మనుషులందరికీ ఒకే విలువ ఉంటుందని, ప్రతి ఒక్కరి వినతిని అధికారులు ఓపికగా విని వారి సమస్యలను అర్థం చేసుకోవాలని అన్నారు. ఆదివాసీలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారితో అధికారులు సంయమనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తీసుకురావడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న ఆదివాసీ ప్రజాప్రతినిధులందరి ప్రధాన డిమాండ్ అడవిపై హక్కులు, తమకు రావాల్సిన ఉద్యోగాలు, తమకు సొంత ఇళ్లు కల్పించడమేనని అన్నారు.ఈ నియోజకవర్గ అభివృద్ధితో పాటు అటవీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడానికి ఆదివాసీ ఎమ్మెల్యేలందరం కలిసి మంత్రులను కలుస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పేదలకు ఎక్కువ ఇళ్లు మంజూరు చేసి, వారికి అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానిదని అన్నారు.పేదలు, ఆదివాసీలపై ముఖ్యమంత్రికి ప్రత్యేక అభిమానంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేదలు, ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలంటే ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి సీతక్క అన్నారు. సామాజిక న్యాయం కోసం దేశంలో ఎక్కడా జరగని విధంగా తెలంగాణలో కులగణన నిర్వహించి బీసీలకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు.అదే విధంగా ఆదివాసీ హక్కుల విషయంలోనూ ఎవరికీ నష్టం జరగకుండా, అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.కొమరం భీమ్ స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నాంకొమరం భీమ్ జల్, జంగల్, జమీన్ కోసం పోరాడారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ వారి అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని అన్నారు.భాష, సంస్కృతి,



వేషధారణే ఆదివాసీల అస్తిత్వంఆదివాసీ సమాజం తన భాష, సంస్కృతి, సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. భాష, వేషధారణ, ఆచారాలు, సంప్రదాయాలు, గోత్రాలు ఆదివాసీల అస్తిత్వంలో భాగమని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సీతక్కప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలతో పాటు అశ్వరావుపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. గ్రామీ ణ మహిళా సమాఖ్య భవనాన్ని సందర్శించి మహిళా సంఘాల కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.ఆదివాసీ సమా జం అభివృద్ధి, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సీతక్క ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.


## ప్రాజెక్ట్ ప్రతిపాదన: తెలంగాణలో సింగిల్-స్క్రీన్ థియేటర్ల పునరుజ్జీవనం

**33 జిల్లాల్లో BC యువతకు శక్తివంతం – సమాజానికి మార్పు**

యూనిఫైడ్ బ్రాండ్ బ్రాండ్

**ఆస్తుల వినియోగం**
ఒక జిల్లాలో ఒక సింగిల్-స్క్రీన్ థియేటర్‌కు భూమి లీజ తీసుకొని, వృద్ధాప్య ఆస్తులను ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాలుగా మార్చడం.

**ఒకే బ్రాండ్ సంస్థ**
రాష్ట్రవ్యాప్తంగా ఒకే బ్రాండ్ ద్వారా ప్రొవెషనల్ గుర్తింపు, కేంద్రీకృత మార్కెటింగ్, భారీ స్థాయిలో కంటెంట్ నెగోసియేషన్ సాధించడం.

**డిజిటల్ పారదర్శకత**
డిజిటల్-ఫస్ట్ బ్యాకెండ్ వ్యవస్థ ద్వారా ప్రతి లావాదేవి, ఆర్థిక నివేదికలు పారదర్శకంగా నిర్వహించి, లీకేజీలను తగ్గించి, పనితీరు సూచికలను మెరుగుపరచడం.

**యువ ఉపాధి & నైపుణ్య శిక్షణ**
కేవలం సినిమా హాళ్లుగా కాదు, శిక్షణ కేంద్రాలుగా ఈ స్థలాలను వినియోగించి, BC కార్పొరేషన్ యొక్క వృత్తిపరమైన కార్యక్రమాలతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం.

**రాజకీయ & సామాజిక ప్రభావం**
పరిపాలనా ఆధునీకరణతో పాట సాంస్కృతిక వారసత్య పరిరక్షణకు దోహదం చేస్తూ, సమాజానికి చేరువైన నాయకత్వంతో వేగంగా అభివృద్ధికి దోహదం చేయడం.

**సూచించబడిన కార్యాచరణ ప్రణాళిక**

**దశ 1: సాధ్యత అధ్యయనం & ఆస్తి ఆడిట్**
33 జిల్లాల్లో ప్రతి జిల్లాలో ఒక అత్యంత అనుకూలమైన సింగిల్-స్క్రీన్ థియేటర్‌ను గుర్తించి, సాంకేతిక ఆడిట్ నిర్వహించడం.

**దశ 2: డిజిటల్ మౌలిక వసతులు**
టికెట్ విక్రయాలు, నిర్వహణ మరియు రియల్-టైమ్ ఆర్థిక నివేదికల కోసం కేంద్రీకృత ERP వ్యవస్థను అమలు చేయడం.

**దశ 3: రినొవేషన్ & ఆధునీకరణ**
శబ్ద నాణ్యత, సౌకర్యవంతమైన సీట్లు, ఆధునిక ప్రొజెక్టర్, పరిశుభ్రత పంటి అంశాలపై దశలవారీగా మెరుగుదలలు చేయడం.

**దశ 4: యువ నైపుణ్య అనుసంధానం**
స్థానిక యువ సంఘాలతో భాగస్వామ్యం చేసి, దినచర్య నిర్వహణ, టికెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ రంగల్లో శిక్షణ ఇవ్వడం.

**దశ 5: ప్రారంభోత్సవం & స్థిరమైన అభివృద్ధి**
జిల్లా స్థాయిలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలతో నెట్‌వర్క్‌ను పున:బ్రాండింగ్ చేయడం.



**కె. ఏ. కుమార్**
వ్యవస్థాపకులు & ప్రధాన సలహాదారు
+91 98491 94366
s9consulting@gmail.com
s9guru@gmail.com

s9consulting@gmail.com
s9guru@gmail.com
https://www.s9consulting.in
చిరునామా: నిలు ఆఫ్ సిరట్, క్యాంటి లిజస్ (ఫ్లోసుసపన) ఇంటర్నేషనల్ స్కూల్ అర్థీ, కామసారా (M), మేలవ్విక్రనిని గిరి తెలంగాణ (వి), కీరాచల్, మల్కాజిగిరి, ఇండియా

S9 CONSULTING
— సత్యం మరియు సేవ —

# అప్పుడు సూర్యని కలవలేకపోయా..



మలయాళ బ్యూటీ మమితా బైజు ప్రస్తుతం 'డ్యూడ్', 'జన నాయగన్' సినిమాల సక్సెస్‌తో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. ప్రస్తుతం సూర్య హీరోగా నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌కు రెడీ అవుతున్నారు. ఈ క్రమంలో తాను 2015లో సూర్యను కలవాలని ఎంత ప్రయత్నించానని చెప్తూ.. ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. కేరళలో జరిగిన మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడారు.


"2015లో సూర్య సర్ కొచ్చిలోని ఒక మాల్‌లో ఈవెంట్‌కి వచ్చారు. అప్పుడు నేను 8వ తరగతి చదువుతున్నా. అదే స్కూల్‌లో మా అన్నయ్య 11వ తరగతి చదువుతున్నాడు. మా అన్నయ్య.. స్నేహితులతో కలిసి సూర్య సర్‌ని చూసేందుకు కొచ్చికి వెళ్లాడు. నేను కూడా ఆయనను కలవాలని చాలా కోరుకున్నాను. ఎంతో ప్రయత్నించాను. వాళ్లతో పాటు వెళ్తానని అమ్మానాన్నతో చెప్పాను. కానీ, వారు నన్ను వెళ్లనివ్వలేదు.

ఆ తర్వాత అన్నయ్య.. సూర్య సర్‌తో దిగిన ఫొటో నాకు చూపించాడు. అది చూసి నిరాశ పడ్డాను. కానీ, ఇప్పుడు సర్‌తో కలిసి సినిమాలో నటించాను. ప్రస్తుతం ఆయనతో కలిసి ఇక్కడ నిలబడడం గొప్ప వరం లాంటిది" అని మమితా ఎమోషనల్‌గా పేర్కొన్నారు.

ఇక, వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య కథా నాయకుడిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెరకెక్కింది. మమితా బైజు కథానాయిక. రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అందుకే 'డీసీ'కి నో చెప్పా ..

## వైరల్ అవుతున్న విజయ్ వ్యాఖ్యలు





లోకేశ్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన యాక్షన్ థ్రిల్లర్ 'డీసీ'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించారు. వామిక గబ్బీ కథానాయిక. ఈ మూవీ ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి టాక్‌ను సంపాదించుకుంది. ఈ క్రమంలో టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండకి సంబంధించిన ఓ పాత ఇంటర్వ్యూ తాజాగా వైరల్ అవుతోంది. 'డీసీ'లో లీడ్ రోల్‌కు ముందుగా విజయ్‌ని సంప్రదించినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

గతంలో ఓ ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. అరుణ్ మాథేశ్వరన్ తనకు ఒక కథని చెప్పారని వెల్లడించారు. కథ నచ్చినా.. ప్రస్తుతం తాను చేస్తున్న సినిమాలాగే ఇదీ ఉండడంతో ఆ ప్రాజెక్టు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం అభిమానులు విజయ్ మాటలను 'డీసీ' సినిమాతో లింక్ చేస్తున్నారు. అయితే, అరుణ్ మాథేశ్వరన్ విజయ్‌కి ఆఫర్ చేసిన సినిమా 'డీసీ'నా? లేక మరో కథా? అనే దానిపై అధికారిక ధ్రువీకరణ లేదు. అటు విజయ్ గానీ, అరుణ్ గానీ ఈ విషయంపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు.

మరోవైపు విజయ్ దేవరకొండ చేతిలో పలు ప్రాజెక్టులు ఉన్నాయి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మికతో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే రవి కిరణ్ కొల దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన'లో విజయ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన సరసన కీర్తి సురేశ్ మెరవనున్నారు. ఈ సినిమా డిసెంబరులో విడుదల కానుంది. 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్‌తో కూడా విజయ్ ఓ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు.

# విశాఖ సమీపంలో నూతన ఎయిర్‌పోర్ట్.. అల్లు అర్జున్ హర్షం



ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విశాఖపట్నం సమీపంలో నూతన అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషకరమని ప్రముఖ నటుడు అల్లు అర్జున్ అన్నారు. ఈ నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలోని ఇనార్బిట్ మాల్‌లో ఏఏఏ మల్టీప్లెక్స్ థియేటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"విశాఖపట్నంతో నాకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉంది. గంగోత్రి షూటింగ్ టైంలో ఇక్కడి రోడ్లపై తిరిగేవాణ్ని. అప్పుడు ఎవ్వరూ గుర్తుపట్టేవారు కాదు. కానీ ఇప్పుడు అలా స్వేచ్ఛగా తిరగలేక పోతున్నా. ఈ నగరంలో ఏఏఏ థియేటర్‌ను ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ జర్నీలో నా భార్య స్నేహ సహకారం మరువలేనిది. ప్రస్తుతం 'రాకా' షూటింగ్ ముంబయిలో జరుగుతోంది. ఈ ఈవెంట్ కోసం సెలవు తీసుకొని వచ్చాను" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. అభిమానుల అభ్యర్థన మేరకు వారిని వేదికపైకి పిలిచి ఫొటోలు దిగారు.

అల్లు అర్జున్ రాక విషయాన్ని తెలుసుకుని పెద్ద ఎత్తున అభిమానులు ఇనార్బిట్ మాల్ వద్దకు తరలివచ్చారు. ఫ్యాన్స్ బైక్‌లపై భారీగా రావడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రారంభోత్సవం అనంతరం అల్లు అర్జున్ అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. మార్గంమధ్యలో అభిమానులకు అభివాదం చేశారు.

# శ్రీలంకతో టెస్టు సిరీస్

### సాయి సుదర్శన్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్‌కు చోటు





శ్రీలంకతో త్వరలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టులో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా సిరీస్‌కు దూరమైన యువ ఓపెనర్/టాప్ ఆర్డర్ బ్యాటర్ సాయి సుదర్శన్ స్థానంలో ముంబైకి చెందిన మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను భారత టెస్టు జట్టులోకి ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ ఆదివారం అధికారికంగా ప్రకటించింది.

ఇటీవల భారత ఎ పర్యటనలో కుడికాలి బొటనవేలికి అయిన తీవ్రమైన గాయంతో బాధపడుతున్న సాయి సుదర్శన్ ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో పునరావాసం పొందుతున్నాడు. అతడు పూర్తి స్థాయిలో కోలుకోకపోవడంతో శ్రీలంక పర్యటనకు దూరమయ్యాడు. ఈ క్రమంలో అనుభవానికే ప్రాధాన్యమిచ్చిన సెలెక్టర్లు, టెస్టుల్లో ఇదివరకే ఆకట్టుకున్న సర్ఫరాజ్ ఖాన్‌ను తిరిగి రేసులోకి తీసుకొచ్చారు.

సర్ఫరాజ్ ఖాన్ భారత్ తరఫున ఇప్పటివరకు 6 టెస్టు మ్యాచ్‌లలో 37.10 సగటుతో 371 పరుగులు చేశాడు. కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ముగిసిన నేపథ్యంలో సర్ఫరాజ్ త్వరలోనే కొలంబోలో భారత జట్టుతో కలవనున్నాడు. అనంతరం జట్టు గాల్ నగరానికి పయనం కానుంది. ఆగస్టు 15 నుంచి తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబో వేదికగా రెండో టెస్టు జరగనున్నాయి.

**భారత టెస్టు జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురేల్ (కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, బ్రర్, దేవదత్ పడిక్కల్, సరాంశ్ జైన్, ఆకిబ్ నబీ, సర్ఫరాజ్ ఖాన్.

# వరల్డ్ అథ్లెటిక్స్ U20 ఛాంపియన్‌షిప్

### బసంత్ కుమార్ మేఘ్‌వాల్ రజతం, షానవాజ్‌కు కాంస్యం






ప్రపంచ అథ్లెటిక్స్ U20 ఛాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. రాజస్థాన్‌లోని అనూప్‌గఢ్‌కు చెందిన 19 ఏళ్ల బసంత్ కుమార్ మేఘ్‌వాల్ పురుషుల హైజంప్ విభాగంలో అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వరల్డ్ అథ్లెటిక్స్ U20 ఛాంపియన్‌షిప్స్‌లో హైజంప్ విభాగంలో భారత్‌కు పతకం అందించిన మొదటి అథ్లెట్‌గా బసంత్ నిలిచాడు.

తీవ్ర పోటీ నడుమ సాగిన ఫైనల్లో విజేతలుగా నిలిచిన టాప్ 3 అథ్లెట్లందరూ 2.21 మీటర్ల మార్కును అధిగమించినప్పటికీ, 2.24 మీటర్ల మార్కును దాటడంలో విఫలమయ్యారు. దీంతో గత ప్రయత్నాల ఆధారంగా పతకాలను ఖరారు చేశారు. అల్జీరియాకు చెందిన యూనిస్ అయాచి తొలి ప్రయత్నంలోనే 2.21 మీటర్ల ఎత్తును దాటి స్వర్ణ పతకం సాధించగా, బసంత్ కుమార్ తన రెండో ప్రయత్నంలో ఆ మార్కును అధిగమించి రజతాన్ని గెలుచుకున్నాడు. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన ఓటిస్ పూల్ మూడో ప్రయత్నంలో దాటి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

**లాంగ్ జంప్‌లో షానవాజ్‌కు కాంస్యం:**
మరొకవైపు, పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో 18 ఏళ్ల భారత అథ్లెట్ షానవాజ్ సత్తా చాటాడు. తన మూడో ప్రయత్నంలో 7.84 మీటర్ల దూరం దూకి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తొలి ప్రయత్నంలో 7.67 మీటర్లు, రెండో ప్రయత్నంలో 7.72 మీటర్లు దాటిన షానవాజ్, మూడో ప్రయత్నంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి భారత్‌కు మరో పతకాన్ని అందించాడు. ఈ విభాగంలో ఇటలీకి చెందిన డానియల్ ఇన్జోలి (7.97 మీటర్లు) స్వర్ణం గెలవగా, ఆస్ట్రేలియాకు చెందిన మేసన్ మెక్‌గ్రోడర్ (7.96 మీటర్లు) రజతం సాధించాడు.

బసంత్ కుమార్ మేఘ్‌వాల్, షానవాజ్‌ల ప్రతిభతో ప్రస్తుత వరల్డ్ అథ్లెటిక్స్ U20 ఛాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 3కి చేరింది.

# పడిక్కల్ సెంచరీ.. సిరాజ్ మెరుపులు

### వార్మప్ మ్యాచ్‌లో భారత్ ధమాకా విజయం!



ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టు అద్భుతమైన ఆరంభాన్ని పొందింది. కొలంబోలోని నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ మైదానంలో శ్రీలంక క్రికెట్ XI తో ముగిసిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక సీఎక్స్ఐ తొలి ఇన్నింగ్స్‌ను 363 పరుగులకు డిక్లేర్ చేయగా, భారత్ రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్‌లాంటి స్పిన్నర్ల ధాటితో వారి పరుగుల వేగానికి అడ్డుకట్ట వేసింది.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు యంగ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో కొండంత అండగా నిలిచాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ 40 పరుగులు చేయగా, పడిక్కల్ 164 బంతుల్లో 142★ పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనికి తోడు రవీంద్ర జడేజా (63) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీ అందించడంతో భారత్ 357 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బౌలర్లు గుర్నూర్ బ్రార్, జడేజా చెరో రెండు వికెట్లతో చెలరేగడంతో శ్రీలంక జట్టు 200 పరుగులకే పరిమితమై డిక్లేర్ చేసింది. 207 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (44), యశస్వి జైస్వాల్ (61) అద్భుతమైన పునాది వేశారు. అయితే ఆఖర్లో ఊహించని మెరుపులు మెరిపించిన ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ కేవలం 15 బంతుల్లో 32★ పరుగులు చేసి భారత్‌ను 45 ఓవర్లలోనే సునాయసంగా విజయతీరాలకు చేర్చాడు. అన్ని విభాగాల్లోనూ సమగ్ర ఆల్‌రౌండ్ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా, ఈ గెలుపుతో రాబోయే టెస్టు సిరీస్‌కు ముందు కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంది.

# హైదరాబాద్ గచ్చిబౌలి వేదికగా తైక్వాండోలో సరికొత్త 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్'



హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 9:

హైదరాబాద్ నగరం మరో చారిత్రాత్మక క్రీడా ఘట్టానికి వేదికైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'లార్జెస్ట్ తైక్వాండో లెసన్' ప్రదర్శన దిగ్విజయంగా పూర్తయి, అధికారికంగా సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డుగా నమోదైంది. ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటికే 30 సార్లు గిన్నిస్ రికార్డులు సాధించిన మార్షల్ ఆర్ట్స్ దిగ్గజం గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

**35 నిమిషాల్లో ప్రదర్శితమైన నైపుణ్యాలు**

ఈ చారిత్రాత్మక వేడుకలో 9 సంవత్సరాల చిన్నారుల నుండి 70 సంవత్సరాల వృద్ధుల వరకు వివిధ వయస్సులకు చెందిన క్రీడాకారులు, అకాడమీ విద్యార్థులు, కోచ్‌లు, మార్షల్ ఆర్ట్స్ ఔత్సాహికులు ఒక్కటై తమ ప్రతిభను చాటారు. పాల్గొన్న 533 మంది క్రీడాకారులు తైక్వాండో అధికారిక దుస్తులైన 'డోబోక్' ధరించి మైదానంలో క్రమశిక్షణతో కొలువుదీరారు. ఈ ప్రదర్శన దాదాపు 35 నిమిషాల పాటు ఏకధాటిగా సాగింది. ఈ సమయంలో క్రీడాకారులందరూ ఉమ్మడిగా 2,000 నుండి 3,000 జంపింగ్ కిక్స్, వివిధ రకాల పంచెస్, బ్లాక్స్ ప్రదర్శించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

**గిన్నిస్ ప్రతినిధి చేతుల మీదుగా పత్రం అందజేత**

కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రతినిధి స్వప్నిల్ నిబంధనలకు లోబడి ప్రదర్శన విజయవంతంగా పూర్తయిందని ప్రకటించారు. అనంతరం వేదికపై గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్ రెడ్డి, ప్రతినిధులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు అధికారిక ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.



తెలుగు నేలకు అంతర్జాతీయ గుర్తింపు

ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో క్రీడలోని క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్య ప్రయోజనాలను ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు నేలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మహత్తర రికార్డు సాధనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో మాస్టర్ గజేందర్ కుమార్, శ్రీకాంత్, కార్యక్రమ సమన్వయకర్త సుమన్, సారంగీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఖాజా ఆఫ్రిది, దైవజ్ఞ శర్మ, ఖలీల్ తదితరులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

# బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం: బండి సంజయ్









- హిందువులంతా ఐక్యంగా ఉండాలని పిలుపు
- న్-జీకి ఉద్యమ స్ఫూర్తి అవసరమన్న బండి
- పాతబస్తీ హిందువులదేనని వ్యాఖ్యలు
- సనాతన ధర్మం కోసం కృషికి పిలుపు

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 09:

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని 'గోల్డెన్ టెంపుల్'గా తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. పాతబస్తీలో బోనాల ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు.. ఎవరూ ఊహించని స్థాయిలో నిధులు కేటాయిస్తామని చెప్పారు. లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో తాను చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడంపై అప్పట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హేళన చేశారని బండి సంజయ్ ఆరోపించారు. ఇప్పుడు కేటీఆర్ అదే అమ్మవారిని దర్శించుకునేందుకు రావడం చూస్తుంటే ఆయనకు జ్ఞానోదయం అయినట్లుందని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ హయాంలో లాల్‌దర్వాజ ఉజ్జయిని మహంకాళి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి అమలు చేయలేదని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను మాత్రమే కాకుండా దేవుళ్లను కూడా మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేంద్ర మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. లాల్‌దర్వాజ బోనాల కోసం ప్రభుత్వం కేవలం రూ.5.50 లక్షలు మాత్రమే కేటాయించిందని అన్నారు. లక్షలాది మంది భక్తులు వచ్చే ఆలయానికి ఇంత తక్కువ మొత్తం ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయిస్తూ.. అధిక సంఖ్యలో హిందువులు పూజించే ఆలయాలకు తక్కువ నిధులు ఇవ్వడం ఏంటని నిలదీశారు.ఒవైసీ బాధపడతారనే కారణంతో సింహవాహిని అమ్మవారి ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. పాతబస్తీలో పన్నులు చెల్లిస్తున్న వారిలో హిందువులు కూడా ఉన్నారని, వారి డబ్బును వారి ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఈ అంశాలను ప్రశ్నిస్తే తనకు మతతత్వవాది అనే ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాతబస్తీ హిందువులకు కూడా సమానంగా చెందుతుందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. హిందూ సమాజాన్ని చైతన్యపరచడం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. తనను విమర్శించే రాజకీయ నాయకులు ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా హిందువులంతా సంఘటితం కావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. జెన్-జీ తరం ఉద్యమ స్ఫూర్తితో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని కూడా అర్థం చేసుకోవాలని సూచించారు. హిందూ సమాజ ఐక్యత కోసం యువత ముందుకు రావాలని కోరారు.బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను అన్ని సౌకర్యాలతో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఉత్సవాల కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తామని చెప్పారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు.సనాతన ధర్మం కోసం కృషి చేస్తున్న యువతకు మరింత శక్తిని ప్రసాదించాలని లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com